# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :191 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది:ఆదివారం 05-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఇక వెంటనే చెక్ క్లీయరెన్స్

ముంబై,చెక్కు వినియోగదారుకలు ఆర్‌బిఐ శుభవార్త చెప్పింది. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక బ్యాంకింగ్ వ్యవస్థలో ఎన్నో మార్పులొచ్చాయి. ఈ క్రమంలో చెక్‌ల క్లీయరెన్స్‌ను కూడా గంటల్లో పరిష్కరించే వ్యవస్థ ఆందుబాటులోకి వచ్చింది. శనివారం నుంచి ఇక చెక్ క్లీయరెన్సులు వెంటలనే అమలవుతాయి. ఏదైనా చెక్కు క్లియర్ అవ్వాలంటే ప్రస్తుతం రెండ్రోజుల సమయం పడుతోంది. ఇకపై ఈ సమయం గణనీయంగా తగ్గనుంది. అక్టోబర్ 4 నుంచి కొన్ని గంటల్లోనే చెక్కు క్లియర్ కానుంది. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బ్యాంకులు శనివారం నుంచి దీన్ని అమలు చేయనున్నాయి. చెక్కులు క్లియర్ చేయడానికి అయ్యే సమయాన్ని గంటల వ్యవధిలోకి తగ్గించేందుకు ఆర్‌బీఐ కంటిన్యూస్ క్లియరింగ్ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో చెక్కు సమర్పించిన గంటల వ్యవధిలోనే క్లియర్ అవుతుంది. ఈ విధానంలో వ్యాపార వేళల్లో చెక్కుల స్కానింగ్, సమర్పణ, క్లియరింగ్ అనేవి నిరంతరాయంగా సాగుతాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు చెక్కులు సమర్పించవచ్చు.

## హైడ్రా దూకుడు.. భాగ్యనగరంలో మరోసారి కూల్చివేతలు



హైదరాబాద్, అక్టోబరు4 : భాగ్యనగరంలో హైడ్రా అధికారుల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. వరుసగా అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇవాళ (శనివారం) కొండాపూర్ లో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. కొండాపూర్‌లోని బిక్షపతి నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు హైడ్రా సిబ్బంది. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు మీడియాని పోలీసులు అనుమతించడం లేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే మీడియాను, స్థానికులను అడ్డుకుంటున్నారు పోలీసులు.కాగా.. కొండాపూర్‌లో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించింది హైడ్రా. దాదాపు రూ.720 కోట్ల 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది హైడ్రా. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలోని సర్వే నంబర్ – 59లో 36 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది.

ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారని హైడ్రా అధికారులు తెలిపారు. అయితే, గతంలో రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది రంగారెడ్డి కోర్టు. రంగారెడ్డి కోర్టు తీర్పును తెలంగాణ హైకోర్టులో సవాల్ చేసింది ప్రభుత్వం. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది హైకోర్టు. 36 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని తేల్చింది హైకోర్టు. హై కోర్టు తీర్పు మేరకు శనివారం ఆక్రమణల తొలగింపును చేపట్టామని హైడ్రా అధికారులు చెప్పుకొచ్చారు. తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించామని హైడ్రా అధికారులు పేర్కొన్నారు.కాగా, హైదరాబాద్‌లో గత కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు భారీ స్థాయిలో వెలిశాయి. కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. యథేచ్ఛగా అక్రమార్కులు నిబంధనలని ఉల్లంఘిస్తున్నారు. అక్రమ నిర్మాణాలతో పలు ప్రాంతాలు వర్షాకాలంలో వరదలకు గురవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై హైడ్రా అధికారులకు ఫిర్యాదులు వస్తోండటంతో చర్యలు చేపట్టారు.

## రేవంత్ రెడ్డిని ఎవరూ కాపాడలేరు.. మరో బాంబ్ పేల్చిన పీకే

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో మరోసారి కొత్త చర్చ మొదలైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎన్నికల వ్యూహకర్త, జాన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ చేసిన సంచలన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్ని రేకెత్తిస్తున్నాయి. ఓ టీవీ ఇంటర్వ్యూలో పాల్గొన్న PK, రేవంత్ రెడ్డిని తీవ్రస్థాయిలో విమర్శించారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీహార్‌కు సంబంధించిన వ్యక్తులపై గతంలో కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'బీహార్ DNA' వ్యాఖ్యలు దుమారం రేపాయి. 2023 డిసెంబర్‌లో తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు, ఆయన తన పూర్వ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పై వ్యాఖ్యలు చేస్తూ.. తన %ణచీూ% తెలంగాణకు చెందినదని, అయితే కేసీఆర్‌ది బీహార్ DNA అని అన్నారు. "తెలంగాణ DNA, బీహార్ DNA కంటే మెరుగైనది" అని కూడా ఆయన వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. కేసీఆర్ కుర్మీ సామాజిక వర్గానికి చెందినవారని, వారి వలసలు బీహార్ నుండి జరిగాయని సూచించే ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా.. ముఖ్యంగా బీహార్ నాయకులు.. రాజకీయ వర్గాలలో తీవ్ర విమర్శలకు దారితీశాయి.అంతకుముందు 2022లో ఆయన తెలంగాణలోని కొందరు ఉన్నతాధికారులను ఉద్దేశించి 'బీహార్ బ్యాచ్' అంటూ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రభుత్వంలో బీహార్‌కు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కీలక పదవులు కట్టబెడుతున్నారని ఆరోపించారు.

### బిహారీలపై అవమానంపై ఆగ్రహం

"తెలంగాణ ప్రజలDNA బిహార్ ప్రజల కంటే మెరుగ్గా ఉందని రేవంత్ చేసిన వ్యాఖ్యలు బిహారీ ప్రజలపై అవమానకరంగా ఉన్నాయి. అదే నిజమైతే ఆయన TPCC అధ్యక్షుడుగా ఉన్నప్పుడు నాతో సహాయం కోసం మూడుసార్లు ఎందుకు కలిశారు?" అని ప్రశాంత్ కిశోర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బిహారీలను అవమానించడాన్ని PK తీవ్రంగా ఖండించారు.

### వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయం: PKహెచ్చరిక



ఇంకా ముందుకు వెళ్లి ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ "రేవంత్ రెడ్డి తన అహంకారంతో, అహంభావంతో నాశనమవుతారు. ఆయనను ఎవ్వరూ కాపాడలేరు. రాహుల్ గాంధీ కూడా ఆయనను రక్షించలేరు. వచ్చే ఎన్నికల్లో రేవంత్ ఓడిపోవడం ఖాయం. తెలంగాణ ప్రజలు తమ నిర్ణయాన్ని స్పష్టంగా చెబుతారు" అని వ్యాఖ్యానించారు.

### రాజకీయాల్లో వేడెక్కుతున్న వాతావరణం

ప్రశాంత్ కిశోర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. కాంగ్రెస్ నాయకులు PK వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తుండగా, ప్రతిపక్షాలు మాత్రం వీటిని కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై విమర్శలకు ఆయుధంగా వాడుకుంటున్నాయి.రేవంత్ రెడ్డి, PK మధ్య గతంలో ఉన్న సాన్నిహిత్యం, తరువాత ఏర్పడిన విభేదాలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రశాంత్ కిశోర్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించనున్నాయి. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఈ వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

## ట్రంప్ ఇగో సాటిస్ పై అయ్యిందా?

న్యూఢిల్లీ,భారత్ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఒక ట్వీట్ ప్రపంచ రాజకీయాల్లో ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. గాజాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను మోదీ బహిరంగంగా ప్రశంసించడం కేవలం ఒక మర్యాదపూర్వక చర్యగా చూడలేం. దీని వెనుక అనేక దౌత్యపరమైన, రాజకీయపరమైన వ్యూహాలు దాగి ఉన్నాయి. ఈ ప్రశంస ట్రంప్ ఇగోకు ఎంతవరకు 'పాజిటివ్ బూస్ట్' ఇచ్చిందో చూద్దాం.

### మోదీ–ట్రంప్ అనుబంధానికి కొత్త రిఫ్రెష్

మోదీ గతంలోనే ట్రంప్‌తో వ్యక్తిగత, రాజకీయ సంబంధాలను బలోపేతం చేసుకున్నారు. "Howdy Modi" ఈవెంట్ నుంచి "Namaste Trump వరకు ఈ ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఎప్పుడూ చర్చనీయాంశమే. ఇప్పుడు ట్రంప్ తిరిగి అధ్యక్షుడిగా ఉన్న సందర్భంలో మధ్యప్రాచ్య శాంతి ప్రయత్నాలకు మద్దతు ప్రకటించడం ద్వారా, మోదీ ఈ ట్వీట్‌తో అమెరికాతో సాన్నిహిత్యాన్ని మరింత బలోపేతం చేయాలని సంకేతం ఇచ్చారు. ఇది ట్రంప్‌తో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని 'రిఫ్రెష్' చేసి, భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సత్సంబంధాలకు పునాది వేసినట్లు కనిపిస్తోంది.

### ట్రంప్ ఇగోకు 'పాజిటివ్ బూస్ట్'

ట్రంప్ వ్యక్తిత్వంలో 'పబ్లిక్ ప్రైజ్' (బహిరంగ ప్రశంస) అంటే ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. మోదీ లాంటి గ్లోబల్ లీడర్ తన అత్యంత కీలకమైన శాంతి ప్రయత్నాలను ప్రశంసించటం ట్రంప్‌కు వ్యక్తిగత, రాజకీయంగా సంతృప్తినిస్తుంది. ముఖ్యంగా, అమెరికా అంతర్గత రాజకీయాల్లో తన శాంతి ప్రయత్నాలను 'గ్లోబల్ అప్రూవల్'గా చూపించుకోవడానికి ఇది ఆయనకు ఒక పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుంది. 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాధినేత నా ప్రయత్నాన్ని మెచ్చుకున్నారు' అని ట్రంప్ తమ మద్దతుదారులకు గట్టిగా చెప్పుకోగలుగుతారు. కాబట్టి, మోదీ చేసిన ప్రశంస ట్రంప్ ఇగోకు పూర్తిగా సంతృప్తినిచ్చిందనే చెప్పవచ్చు.

### అంతర్జాతీయ దౌత్యంలో భారత్ 'బ్యాలెన్సింగ్'

భారతదేశం ఎప్పటిలాగే మధ్యప్రాచ్య అంశాల్లో సమతుల్య వైఖరినే పాటిస్తోంది.



ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగిస్తూనే, పాలస్తీనా పట్ల మానవతా దృష్టితో మద్దతు ఇస్తుంది. మోదీ చేసిన వ్యాఖ్యల్లోనూ అదే ప్రతిబింబిస్తోంది. "ఇరువర్గాలకు సమ న్యాయం కలిగే ప్రయత్నాలకు మద్దతు" అని చెప్పడం దానికి ఉదాహరణ. ట్రంప్ ప్రణాళికను మెచ్చుకున్నప్పటికీ, భారత్ యొక్క అంతిమ లక్ష్యం మాత్రం శాశ్వతమైన, సమతుల్యమైన శాంతి అని స్పష్టం చేశారు. తద్వారా భారత్ తన బ్యాలెన్సింగ్ యాక్ట్‌ను విజయవంతంగా కొనసాగించినట్లైంది.

### భారత్ గ్లోబల్ పీస్ ఆర్కిటెక్ట్‌గా ఎదగాలనే సంకేతం

మోదీ వ్యాఖ్యలు కేవలం ట్రంప్ ప్రశంస మాత్రమే కాదు. భారత్ ప్రపంచ శాంతి కృషిలో సక్రియ పాత్ర పోషిస్తోందని, గ్లోబల్ ప్లేయర్‌గా ఎదగాలనే ప్రయత్నంలో భాగమని కూడా చూడాలి. ఈ ట్వీట్‌తో భారత్ తనను తాను ఒక బాధ్యతాయుతమైన ప్రపంచ శక్తిగా ప్రకటించుకుంది. గాజా యుద్ధం తగ్గుముఖం పట్టే సంకేతాలు కనిపిస్తున్న తరుణంలో మోదీ సందేశం అంతర్జాతీయ వేదికపై భారత్ పాజిటివ్ రోల్ మోడల్‌గా నిలిచే ప్రయత్నంలో భాగం.మోదీ చేసిన ఈ 'ప్రశంసా ట్వీట్'లో అంతర్భాగం రాజకీయ వ్యూహం. ఒకవైపు ట్రంప్ ఇగోను తృప్తిపరుస్తూ, మరోవైపు గ్లోబల్ దౌత్యంలో భారత్ సంతులిత దృక్కోణాన్ని కొనసాగించారు. ఇది అమెరికా–భారత్ సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు, ప్రపంచ వేదికపై భారత్ పాత్రను విస్తరించేలా చేస్తుంది.

## తొక్కిసలాట ఘటన.. విజయ్‌కు మరో బిగ్ షాక్



చెన్నై:ఇటీవల తమిళనాడులోని కురూర్‌లో టీవీకే అధినేత విజయ్ నిర్వహించిన ప్రచారం ర్యాలీలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ విషాద ఘటనలో 41 మంది దుర్మరణం చెందారు.ఈ ఘటనలో కుట్ర ఉందని టీవీకే ఆరోపణలు చేసింది. తొక్కిసలాటపై సీబీఐ విచారణ జరపాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేసింది. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన మద్రాస్ హైకోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. విజయ్ పార్టీపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. కరూర్ ఘటనపై పోలీసుల దర్యాప్తు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నట్లు పేర్కొంది.ఇలాంటి సమయంలో సీబీఐవిచారణను కోరడం సరైంది కాదని స్పష్టం చేసింది. కోర్టులను రాజకీయ ప్లాట్‌ఫామ్‌లుగా మార్చొద్దంటూ సూచించింది. అంతేకాదు తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు జరపాలని బీజేపీ న్యాయవాది జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలకు కూడా పలు సూచనలు చేసింది. " ఇకనుంచి భవిష్యత్తులో నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించినప్పుడు అక్కడ తాగురు, పారిశుద్ధ్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. అలాగే అంబులెన్స్ సేవలు, నిష్క్రమణ మార్గాలు ఉండాలి. ప్రజల భద్రతకే ముందుగా ప్రాధాన్యం ఇవ్వాలని" హైకోర్టు సూచించింది. మరోవైపు ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించే వరకు రహదారులపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు పర్మిషన్ ఇవ్వరని తమిళనాడు ప్రభుత్వం కోర్టుకు చెప్పింది.ఇదిలాఉండగా ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ టీవీకే నామక్కల్ జిల్లా సెక్రటరీ సతీష్ కుమార్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. అయితే కోర్టు ఈ పటిషన్‌ను కూడా కొట్టివేసింది. ర్యాలీ సమయంలో జన సమూహాన్ని నియంత్రించడంలో పార్టీ ఎందుకు ఫెయిల్ అయ్యిందని జడ్జి ప్రశ్నించారు. అంతేకాదు తొక్కిసలాట బాధితులకు అదనపు పరిహారం ఇవ్వాలని కోరుతూ మరో పిటిషన్ దాఖలుకాగా.. దీనిపై స్పందించాలని కోరుతూ కోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## పీవోకే నిరసనకారులు,ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందం

ఇస్లామాబాద్: గత కొన్ని రోజుల నుంచి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆందోళనలు మిన్నంటుతున్న విషయం తెలిసిందే. అయితే శనివారం నిరసనకారులు, పాక్ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. హింసాత్మక ఆందోళనల్లో ఇప్పటి వరకు పది మంది మృతిచెందగా, వందలాది మంది గాయపడ్డారు. జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జేకేజేఏఏసీ), ప్రభుత్వం మధ్య సెప్టెంబర్ 29వ తేదీన జరిగిన చర్చలు విఫలం కావడంతో అక్కడ హింస మొదలైంది. జేఏఏసీ ఆందోళనకారులు తీవ్ర స్థాయిలో హింసకు పాల్పడ్డారు. నిరసన సమయంలో వాహనాలకు నిప్పుపెట్టారు. ఆ సమయంలో జరిగిన కాల్పుల్లో పది మంది మరణించారు.38 పాయింట్ల ఎజెండాతో జేఏఏసీ ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. తొలుత ప్రభుత్వం ఆ డిమాండ్లకు అంగీకరించలేదు. దీంతో ఆందోళన ఉధృతమైంది. పోలీసులు, పౌరులు హింసలో గాయపడ్డారు. అయితే ఇవాళ రెండు వర్గాల మధ్య డీల్ కుదిరినట్లు ప్రకటించారు. కుట్రలు,



అవాస్తవాలన్నీ సమసి పోయినట్లు ప్రధాని షహబాజ్ షరీఫ్ ప్రకటించారు. జేఏఏసీతో డీల్ కుదుర్చుకున్న ప్రభుత్వ కమిటీకి ధన్యావాదాలు తెలిపారు. శాంతి, సామరస్యం ఏర్పడడం మంచి సంకేతం అన్నారు.

## ఆరు నెలలోపు టిమ్స్ ఆస్పత్రి నిర్మాణాలు పూర్తి చేయాలి.. హరీశరావు డిమాండ్



హైదరాబాద్ : హైదరాబాద్ నగరానికి నలు దిక్కులా నిర్మాణంలో ఉన్న టిమ్స్ ఆస్పత్రి భవనాలను ఆరు నెలలోపు పూర్తి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆరు నెలలోపు ఆస్పత్రులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మాణం మొదలుపెట్టిన కొత్తపేట టిమ్స్ ఆస్పత్రిని మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పరిశీలించారు. నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎందుకు రెండు సంవత్సరాల నుండి టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం కాలేదు. ఆనాడు మేము భూసేకరణ చేసి, టెండర్లు పిలిచి, డిజైన్లు పూర్తి చేసి, 6 అంతస్తుల భవన నిర్మాణం పూర్తి చేసాము.. కానీ ఈ ప్రభుత్వం రెండేళ్లలో 5 ఫ్లోర్లు మాత్రమే వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండి ఉంటే ఈ ఆసుపత్రి గత ఏడాదే ప్రారంభమయ్యి ప్రజలకు సేవలు అందించేది. ఎక్కడ కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి పేరు వస్తుందో అని కావాలనే ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని స్లో చేస్తున్నారు. ముందు చూపు లేని మంద బుద్ధి కలిగిన నాయకులు కాంగ్రెస్ నాయకులు అని హరీశ్‌రావు విమర్శించారు.కేసీఆర్ హయాంలో మహేశ్వరం నియోజకవర్గంలో రూ.176 కోట్లతో మెడికల్ కాలేజీ, 500 పడకల ఆసుపత్రిని కట్టడానికి జీవో ఇచ్చాం. 27-09-2023 నాడు నేను, సబితక్క కలిసి వెళ్ళి ఆ మెడికల్ కాలేజీకి, 500 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన కూడా చేశాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మెడికల్ కాలేజీని, 500 పడకల ఆసుపత్రిని రద్దు చేసి ఎల్బీ నగర్ టిమ్స్‌లో విలీనం చేశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.కుత్బుల్లాపూర్ నియోజకవరంలో రూ.182 కోట్లతో ఇంకో మెడికల్ కాలేజీని కట్టాలని కేసీఆర్ జీవో ఇస్తే, ఈ ప్రభుత్వం అది రద్దు చేసి అల్వాల్ టిమ్స్‌లో కలిపారు. మేడ్చల్ జిల్లాలో ఒక్క మెడికల్ కాలేజీ లేకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసింది అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆరోగ్యశ్రీని రూ. 10 లక్షలకు పెంచాను అంటావు.. ఇవాళ ఆసుపత్రుల వాళ్ళు మేము ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయము బంద్ చేస్తాము అని చెప్తున్నారు. నీ పాలన ఎలా ఉంది అంటే.. కాలేజీలు బంద్ చేస్తామని ప్రైవేట్ కాలేజీలు, ఆసుపత్రులు బంద్ చేస్తామని ప్రైవేట్ ఆసుపత్రులు చెప్తున్నాయి. ఆరోగ్యశ్రీకి కేసీఆర్ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నిధులు ఇచ్చి మంచి వైద్యం అందించాము.. కానీ నువ్వు వచ్చి రూ.1400 కోట్లు ఆరోగ్యశ్రీ కింద బకాయి పెట్టావు. ఇప్పటికైనా ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేసి.. పేదలకు వైద్యం అందే లాగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

### సిబిఐ విచారణకు తిరస్కరణ

చెన్నై, తమిళనాడులోని కరూర్‌లో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందిన విషయం సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ చేపట్టాలని మద్రాస్ హైకోర్టులో టీవీకే పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఈ పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.విచారణ ప్రారంభ దశలోనే సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించింది. న్యాయస్థానాలను రాజకీయ వేదికలుగా మార్చకూడదని హెచ్చరించింది. ప్రభుత్వాలతో పాటు ప్రజలకూ అవగాహన, బాధ్యత ఉండాలని సూచించింది. ముఖ్యంగా ఇలాంటి పెద్ద సమావేశాలకు హాజరుకావడానికి ముందుగా ఆలోచించి, జాగ్రత్తలు తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది.

## తెలుగు ప్రజలు ఓజీ సినిమా చూశారు.. దసరా చేసుకున్నారు..



విజయవాడ : దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ ఘనంగా జరిగిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. తెలుగు ప్రజలు ఓజీ సినిమా చూశారని.. దసరా పండుగను చేసుకున్నారని వ్యాఖ్యానించారు. విజయవాడ ఉత్సవ్‌తో నగరానికి కొత్త కళ వచ్చిందని చెప్పారు. ఇవాళ ఆటో డ్రైవర్ల పండుగలో ఉన్నామని చెప్పారు. విజయవాడలో ఆటో డ్రైవర్ల సేవలో పథకం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులకు రూ.436 కోట్లను అందజేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎవరినీ పట్టించుకోలేదని అన్నారు. 2024 ఎన్నికలు తన చరిత్రలో ఎప్పుడూ చూడనివి అని అన్నారు. 94 శాతం స్ట్రైక్ రేటుతో గెలిపించారని పేర్కొన్నారు. ఇప్పుడు మంచి ప్రభుత్వం మంచి పనులు చేస్తోందని తెలిపారు. 15 నెలల కూటమి పాలనలో అనేక పథకాలు తీసుకొచ్చామని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందని చెప్పారు. ఇప్పుడు రోడ్లు బాగుపడ్డాయి.. ప్రయాణాలకు ఇబ్బంది లేదని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో మహిళలు సంతోషంగా ఉన్నారని చెప్పారు.ఆటో డ్రైవర్లలో చాలామంది పేదవాళ్లే ఉంటారని చంద్రబాబు అన్నారు. ఏడాదికి రూ.15వేలు ఇస్తే వారికి కొంత ఊరటగా ఉంటుందని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో డబ్బులు రాని వారు ఎవరో తెలియజేస్తే వారికి డబ్బులు ఇచ్చే బాధ్యత తనదే అని అన్నారు. డ్రైవర్లకు అనేక కష్టాలు ఉండేవని చంద్రబాబు

## సంపాదకీయం

ఆదివారం 05-10-2025

# రూ.వెయ్యితో ఎలా బతికేదీ?

నెలకు వెయ్యి రూపాయలు లేదా అంతకన్నా తక్కువ పింఛను వస్తే పరిస్థితేంటి? 1952 భవిష్య నిధి చట్టం (ఈపీఎఫ్) కిందకు వచ్చే ఉద్యోగుల పింఛన్ పథకం (1995) కింద 37 లక్షలమంది వృద్ధులు, వారి కుటుంబాలకు ఇస్తున్న మొత్తం ఇంతే! ఈ అరకొర పింఛన్‌తోనే ఆహారం, దుస్తులు, ఇంటి అద్దెలు, వైద్యం వంటి ఖర్చులన్నీ తీరిపోవాలి. ఉద్యోగ జీవితమంతా శ్రమించి, పన్నులు కట్టి, దేశ ఆర్థిక ప్రగతి యజ్ఞంలో భాగస్వాములైన వారికి న్యాయమైన పింఛన్ దక్కేదెప్పుడు? దేశంలో కోట్లమందికి ఈపీఎఫ్ పింఛన్‌కన్నా ఎక్కువ మొత్తాలనే వృద్ధాప్య పింఛన్ల కింద చెల్లిస్తున్నారు. వారిలో అత్యధికులు ఉద్యోగాలు చేసి ఆదాయ పన్నులు కట్టినవారూ కాదు. ఉదాహరణకు ఈపీఎఫ్ కనీస పింఛన్ రూ.1000 అయితే, రెండు తెలుగు రాష్ట్రాలు వృద్ధాప్య పింఛన్లను ఇంతకన్నా ఎక్కువే ఇస్తున్నాయి. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పింఛన్ వేల రూపాయల్లో ఉంటుంది. పార్లమెంటు సభ్యులు, అసెంబ్లీ సభ్యులు పూర్తికాలం పదవిలో ఉండకపోయినా పూర్తి పింఛన్ లభిస్తుంది. ఎంపీగా, ఎమ్మెల్యేగా రెండు పదవులూ నిర్వహించిన వారికి డబుల్ పింఛన్లు వస్తాయి. వీరెవరికీ ఈపీఎఫ్ పింఛన్లంత తక్కువగా లభించవు. ఈపీఎఫ్ చందాదారులకు పింఛన్ పొందడం హక్కు అనీ, ప్రభుత్వం చేసే దానం కాదని న్యాయస్థానాలు కూడా స్పష్టం చేశాయి.

### ఎగవేయడానికి సాకులు

ఈపీఎఫ్ పింఛన్ పథకంలో 5.39 కోట్లమంది సభ్యులు ఉన్నారు. వారిలో ప్రస్తుతం పింఛన్ పొందుతున్నవారి సంఖ్య 81 లక్షలకుపైగానే ఉంటుంది. ఈ కొద్దిమందికి కూడా ఎక్కువ మొత్తంలో పింఛన్లు చెల్లించడానికి కావాల్సిన సొమ్ము తమ దగ్గర లేదని ప్రభుత్వం చేతులు ఎత్తేస్తోంది. ఈపీఎఫ్ పింఛన్ నిధికి ఎంతమొత్తం జమ చేయాలి, ఉద్యోగి రిటైరయ్యాక ఎంతమొత్తం పింఛన్‌గా వస్తుందనేది ముందుగానే నిర్ణయమవుతుంది. కనుక పింఛన్ సరిపోవడం లేదనే కారణంపై తరవాత దాన్ని పెంచడం సాధ్యపడదని ప్రభుత్వం చెబుతోంది. ఇదే సర్కారు మొదటి అభ్యంతరం. యాక్చురియల్ వాల్యుయేషన్ అనేది రెండో అభ్యంతరం. ఇది భవిష్యత్తులో ఉద్యోగికి చెల్లించాల్సిన పింఛన్, గ్రాట్యుటీ మొదలైన వాటికి సంబంధించి ప్రస్తుత విలువను లెక్కించే పద్ధతి. ప్రస్తుతమున్న నిధి, భవిష్యత్తులో జమలను కలుపగా వచ్చే మొత్తం పింఛన్లను చెల్లిస్తూనే ఉండటానికి సరిపోతుందా అనేది ఈ పద్ధతిలో అంచనా వేస్తారు. 2019 మార్చి 31నాటికే ఈ నిధి లోటు ఎదుర్కొంటోందని సర్కారు చెబుతోంది. పింఛన్ విషయంలో ప్రభుత్వం చెబుతున్న మూడో అభ్యంతరం- పే యాజ్ యూ గోకు సంబంధించింది. ఈ పద్ధతిలో ప్రస్తుత ఉద్యోగులు పింఛన్ నిధికి జమ చేస్తూ ఉంటే రిటైరైన ఉద్యోగులకు ఆ నిధి నుంచి పింఛన్లు చెల్లిస్తారు. ఈ పద్ధతిలో ఉద్యోగులే తమలో తాము పింఛన్లు చెల్లించుకుంటారు. కానీ, వాస్తవంలో అలా జరగదని ప్రభుత్వం చెబుతోంది. బయటి నుంచి (అంటే ప్రభుత్వం నుంచి) నిధులు రానిదే పింఛన్ల చెల్లింపు సాధ్యం కాదంటోంది. ఈ అభ్యంతరాలు కేవలం సాకుల్లాంటివేనని తెలుస్తోంది. సంక్షేమ రాజ్యంలో సామాజిక భద్రత కింద వృద్ధులకు పింఛన్లు ఇచ్చి ఆదుకోవడం ప్రభుత్వ విధి. ఈపీఎఫ్ సభ్యులు ఉద్యోగ విరమణ చేసేనాటికి వస్తున్న జీతంలో కనీసం సగాన్ని పింఛన్‌గా ఇవ్వడం న్యాయం, అవసరం. ఇప్పుడిస్తున్న కనీస పింఛన్లను ఈ స్థాయికి పెంచడం అనివార్య బాధ్యతగా గుర్తించాలి. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఉద్యోగుల పింఛన్ పథకంలో జమై ఉన్న మొత్తం రూ.9,92,689 కోట్ల పైచిలుకు అని కేంద్ర కార్మికశాఖ సహాయ మంత్రి శోభా కరాంద్లాజె పార్లమెంటుకు తెలిపారు. ఈ మూలనిధితో పోలిస్తే ఏటా పింఛన్ చెల్లింపులకు ఖర్చవుతున్న మొత్తం చాలా తక్కువ. ఉదాహరణకు 2023-24లో రూ.8,88,269 కోట్ల మూలనిధి ఉండగా, ఆ ఏడాది పింఛన్ల కింద చెల్లించిన మొత్తం అందులో 2.59 శాతమే- అంటే రూ.23,027 కోట్లపైచిలుకు మాత్రమే. ఆ సంవత్సరం మూలనిధిపై వచ్చిన వడ్డీ రూ.58,668.73 కోట్లు. అది ఆ ఏడాది పింఛన్ల కింద చెల్లించిన మొత్తానికి రెట్టింపుకన్నా ఎక్కువే. పైగా పింఛను పథకంలోని మొత్తం 5.39 కోట్లమంది సభ్యుల్లో ప్రస్తుతం పింఛన్ పొందుతున్నవారు కేవలం 15శాతమే. ఏటేటా ఎక్కువమంది రిటైరవుతారు కాబట్టి పింఛన్ చెల్లింపులూ ఎక్కువవుతాయి. అదే సమయంలో అంతకన్నా ఎక్కువగా కొత్త సభ్యులూ ఈపీఎఫ్‌లో సభ్యులవుతారని గమనించాలి. ఏ సంవత్సరంలో చూసినా ఈపీఎఫ్‌లో జమయ్యే మొత్తంకన్నా పింఛన్లుగా చెల్లించే మొత్తం చాలా తక్కువగా ఉంటుంది. నిరుడు పింఛన్ నిధికి రూ.71,780.41 కోట్లు జమ కాగా, పింఛన్లుగా చెల్లించినది రూ.23,410.17 కోట్లు మాత్రమే. అలాంటప్పుడు పింఛన్లు చెల్లించడానికి డబ్బులు లేవని సర్కారు చెప్పడం సమంజసం కాదనే భావించాలి.

### భారమేమీ కాదు...

ప్రస్తుతం ఉన్న 81 లక్షలమంది పింఛన్‌దారుల్లో 78 లక్షల మందికి రూ.5,000కన్నా తక్కువ పింఛన్ వస్తోంది. 58 లక్షల మందికి రూ.2,000కన్నా తక్కువ లభిస్తోంది. వెయ్యి రూపాయల పింఛన్‌ను రూ.5,000కు పెంచాలంటే రూ.46,918 కోట్లు కావాలి. పింఛన్‌ను రూ.10,000కు పెంచాలంటే దీనికి రెట్టింపు మొత్తం కావాలి. ఇలా చెల్లించే స్తోమత మూలనిధికి ఉంది. ఒక న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర కమిషన్‌ను నెలకొల్పి అన్ని అంశాలనూ పరిశీలించి, న్యాయమైన పింఛన్‌ను నిర్ధారించవచ్చు. 2011 జనగణన ప్రకారం దేశ జనాభాలో 8.6శాతం 60 ఏళ్లు దాటినవారే. 2050కల్లా వీరు జనాభాలో 20.8 శాతానికి చేరనున్నారు. వీరిలో ప్రైవేటురంగ ఉద్యోగుల యోగక్షేమాలను చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఉద్యోగి రిటైరయ్యే నాటికి పొందుతున్న జీతంలో సగాన్ని పింఛన్‌గా నిర్ణయించడం ప్రభుత్వ కనీస విధిగా భావించాలి.

# రాహుల్ అజ్ఞానానికి పరాకాష్ట!

న్యూఢిల్లీ,విదేశాలకు వెళ్లడం..అక్కడ భారత్ పాలకులపై దుమ్మెత్తి పోయడం,ప్రజాస్వామ్యం అపహాస్యం అవు తోందని గగ్గోలు పెట్టడం కాంగ్రెస్ ఎంపి, విపక్షనేత రాహుల్ గాంధీకి బాగా అలవాటయిన కార్యక్రమం. విదేశీ గడ్డపై నుంచి దేశంపై దుమ్మెత్తి పోయడం అలవాటు చేసుకున్న నేతగా బహుళ ప్రచారం పొందు తున్నారు. విదేశీయతను పుణికి పుచ్చుకున్న అపరమేధావిగా నిరూపించుకుంటున్నారు. బిజెపిని విమర్శించినప్పుడల్లా ఆర్ఎస్ఎస్ భావజాలం అంటూ విమర్శలు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం గురించి తెలిసి ఉంటే రాహుల్ ఇలా మాట్లాడరు. ఇకపోతే తమ పాలనలోనే భారతదేశం బాగా పరిఢ విల్లిందని, ఇతరుల అంటే బిజెపి పాలనలో దేశం సర్వనాశనం అవుతోందని, ఆర్ఎస్ఎస్, బిజెపిలు కలిసి దేశాన్ని నాశనం చేస్తున్నాయని ఆయన చేస్తున్న విమర్శలు అజ్ఞానానికి పరాకాష్టగా చూడాలి. నిజానికి ఈ దేశంలో రాహుల్‌కు ఉన్న అర్హత ఏమిటి. కేవలం రాజీవ్ గాంధీ తనయుడుగానే ఆయనకు స్థానం ఉంది. అంతకు మించిన రాజకీయ ప్రస్థానం ఆయనకు లేదు. వారసత్వ రాజకీయాల్లో పార్టీ అధ్యక్షుడిగా, ఎంపిగా వెలగబెడుతున్న రాహుల్ భారత్ ఔన్నత్యం, గొప్పతనం గురించి తెలియని అజ్ఞానిగా భావించాలి. అధికారం కల్ల అని తెలుసుకోవడంతో ఏదేదో మాట్లాడుతున్నారు. అడ్డగోలు విమర్శలు చేస్తున్నారు. బంగ్లాదేశ్, నేపాల్ లాంటి ఆందోళనలు మనదేశంలోనూ రావాలని కోరుకుంటున్నారా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. వసుదైక కుటుంబ, సర్వేజనా సుఖినో భవంతు అన్న ఆర్యోక్తి మన మట్టిలో పుట్టిన అత్యున్నత మానవాతా వాద విలువలకు అద్దంపట్టేవి.. కానీ ఇవేవీ తెలియకుంటా ఏదోఒక చిన్న దేశానికి వెళ్లడం అక్కడ భారత్‌లో పాలన సరిగా లేదని, ఇక్కడ ప్రజాస్వామ్యం భ్రష్టుపట్టి పోతోందని గొంతు చించుకుంటున్నారు. ఈ దేశంలో ప్రజలు ఎంతో ఉన్నతంగా ఆలోచించి కాంగ్రెస్‌ను ఆదరించారు. అది ఎన్ని దేశద్రోహ పనులు చేసినా వెనకేసు కొచ్చారు. ఎమర్జెన్సీతో భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. అలాంటి పార్టీలో ఉంటూ ప్రజా స్వామ్యం గురించి, ఓట్ చోరీ గురించి గొంతు చించుకుంటున్నారు. అంతకు మించి ఆర్ఎస్ఎస్ గురించి అవాకులు చవాకులు పేలుతన్నారు. నిజానికి రాహుల్ భారతీయత కలిగిన నేత అయితే ఆర్ఎస్ఎస్ గరించి తెలుసుకుని ఉండేవారు. ఈదేశం కోసం, దేశ పటిష్టత కోసం, దేశం సర్వతో ముఖోన్నతి కోసం అహరహరం శ్రమిస్తున్న ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్. దాని గురించి తక్కువ మాట్లాడే వారు చరిత్ర హీనులు కాకతప్పదు. హిందూ సంస్కృతి నశిస్తే హిందూ సమాజమే ఉండదు. ప్రపంచానికి నాగరిక తను నేర్పిన దేశం కేవలం హిందూమతం, భారతదేశం మాత్రమే. ఎన్నోదాడులను, మత దురాచారా లను, మతమార్పిడులను తట్టుకుని కూడా భారత్ ఇవాళ ప్రపంచానికి వెలుగుదివిటీగా సాగుతోంది. ఆర్ఎస్ఎస్ శతవసంతాల వేళ విదేశీ గడ్డపై నుంచి ఆర్ఎస్ఎస్ గురించి చేసిన ప్రేలాపనలు ఎంతమాత్రం సహించ రానివి. ఎన్నో దాడులు, బలిదానాలు, మతమార్పిళ్ల నేపథ్యంలో హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం ప్రతి హిందువు కర్తవ్యం అంటూ డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్ వంద సంవత్సరాల క్రితం స్థాపించిన 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' నేడు భారతదేశ చరిత్రను పునర్లిఖించే క్రమంలో ఉన్నది.1925 విజయదశమి రోజున నాగపూర్‌లో హెడ్గేవార్ స్థాపించిన ఈ సంస్థ దినదిన ప్రవర్ధమానమై దేశ ఐక్యతకు, ప్రపంచ శాంతికి పాటుపడుతోంది. 'నమస్తే సదా వత్సలే మాతృ భూమే' ఇది ఆ సంఘ్ ప్రాణగీతం.తల్లి భరతమాతను ఈ ప్రపంచానికే విశ్వగురువుగా నిలబెట్టాలన్నది ఆరెస్సెస్ ఏకైక లక్ష్యం. అందుకోసం ప్రతి భారతీయుడినీ, ముఖ్యంగా యువతను దేశ నిర్మాణంలో పాలు పంచుకునేలా చేయాలన్నదే తపనతో పనిచేస్తున్న ఏకైక సంస్థ అనడంలో ఎలాంటి అనుమానాలు లేవు. స్వాతంత్య్ర పోరాటంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాలుపంచుకోలేదనేది చరిత్ర తెలియని దేశ వ్యతిరేకుల ఆరోపణ. స్వాతంత్య్రం కోసమే దేశ భక్తులను సంఘ్ తయారు చేసింది. హెడ్గేవార్ 1921, 1931లో జైలు నిర్బంధానికి గురయ్యారు. వార్ధాలో హెడ్గేవార్‌ను కలుసుకున్న గాంధీజీ సంఘ్ క్రమశిక్షణను ప్రశంసించిన విషయం తెలుసుకుంటే మంచిది. దేశం పెను ప్రమాదాలు, విపత్తులు ఎదుర్కొన్నప్పుడు స్వయం సేవకులు తమ ప్రాణాలు కూడా లెక్క చేయకుండా ప్రజలకు సేవలందిస్తోంది. పాక్, చైనాలతో భారత్ యుద్ధం చేసిన సమయంలో భారత సైన్యానికి అండగా నిలబడ్డ సంస్థ



కూడా ఆర్ఎస్ఎస్ అని రాహుల్ తెలుసుకుంటే మంచిది. దేశ విభజన, పంజాబ్, బెంగాల్ ప్రాంతాల్లోని హింస, దోపిడీ, అత్యాచారాలను నిలువరించడం, వలస వచ్చిన శరణార్థు లకు శిబిరాల ఏర్పాటు, కరువు సమయం లో నిత్యావసర వస్తువులను అందించడం వంటి చర్యల ద్వారా సంఘ్ చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 1977 నాటి దివిసీమ ఉప్పెనకు బలైన 20వేల మంది మృతదేహాల ను, పశువుల కళేబరాలనూ ఖననం చేసిన ఘనత సంఘ కరసేవకులదే. 1975 నాటి ఎమర్జెన్సీ సమయం లో జైలుకు వెళ్లిన వారిలో అనేకులు స్వయం సేవకులు ఉన్నారు. అవివేకంతో కూడిన అభ్యాసం కంటే జ్ఞానం మేలు. జ్ఞానం కంటే ధ్యానం ఉత్తమం. ధ్యానం కంటే కర్మఫల త్యాగం మంచిది. ఆ త్యాగం వల్ల మనశ్శాంతి కలుగుతుంది.' అని భగవద్గీత శ్లోకం భావం. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆశయాలతో కూడిన అనేక సంస్థలు ఉన్నాయి. అయితే వందేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ త్యాగాలకు సాటిరాగల మరో సంస్థ లేదనే చెప్పాలి. ఎందుకంటే ఆయా సంస్థలకు స్వలాభాపేక్ష ఉంది. కానీ ఆర్ఎస్ఎస్‌కు మాత్రం దేశ హితమే స్వార్థంగా ఉంది. వేల సంవత్సరాల భారతీయ సామాజిక విలువలే ఆలంబనగా, సామాజిక జీవనంలో ఏర్పడిన లోటుపాట్లను అధిగమిస్తూ, జీవన విధానంలో దృఢత్వం, సమాజం కోసం అంకితమైన వ్యక్తిత్వం తో ఓ విలక్షణమైన కార్యదీక్ష కలిగిన క్రమశిక్షణాయుత సమూహం ఆరెస్సెస్ సొంతం. అందుకే, కాలగమ నంలో అవరోధాలను, అణచివేతలను అధిగమిస్తూ... ప్రతికూల పరిస్థితుల్లో సైతం తన ప్రాబల్యాన్ని విస్తరిస్తూ, భారతీయ సంస్కృతిలోని సనాతన మూలాల నుంచి జాతీయవాద భావనతో ఆవిర్భవించి, మానవతా వాదాన్ని ఆవిష్కరిస్తోంది. దేశభక్తి అంటే జెండా ఎగరేయడం, దేశభక్తి గీతాలు పాడడం, ఐక్యత ప్రతిజ్ఞ చేయడం కాదని, ఈ స్ఫూర్తి మన ప్రవర్తనలో ప్రతిబింబించి, సమాజంలో పరివర్తనకు బీజాలు వేయాలన్నది ఆరెస్సెస్ లక్ష్యం. సమాజంలో అన్ని వర్గాల ప్రజలతో అరమరికలు లేకుండా కలిసి పనిచేసే అలవాట్లను ఆర్ఎసెస్ నేతలు ప్రేరేపించారు. ఈ స్ఫూర్తి కారణంగానే వందలాది సంఘ్ ప్రేరేపిత సంస్థలు భారతదేశ మంతటా పనిచేస్తున్నా ఎక్కడా అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు చెలరేగడం కనిపించదు. పైగా, వాటి పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపిస్తుంది. కులం, వర్గం, మతం, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు సమైక్యంగా ఉండాలని మాటలు చెప్పడం కాకుండా, ఆచరణలో ఆ విధంగా జీవించే వాతావరణం ఏర్పాటు చేయడంలో ఆరెస్సెస్‌ను మించిన మరో సంస్థ లేదని చెప్పవచ్చు. అందుకే రాజకీయాల పరిధిని మించి చూడలేని రాహుల్ లాంటి వారికి ఆరెస్సెస్ కార్యపద్ధతి అర్థం కాదు. దేశ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చూస్తేనే ఈ సంస్థ సిద్దాంతం అవగతమవుతుంది. ఆవిర్భావం నుంచి రాజకీయ అధికారం కోసం కాకుండా 'వ్యక్తి నిర్మాణం' కేంద్రంగా, ప్రజలందరి శ్రేయస్సు కోసం ఆరెస్సెస్ పనిచేస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు సహాయం చేయడానికి, సహాయ కార్యక్రమాలను నిర్వహించడానికి, పేద పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు అందించడానికి, వృద్ధులకు సేవ చేయడానికి స్వయం సేవక్‌లు అందించే సేవలలో వివక్ష మచ్చుకైనా కనిపించదు. ఇంతటి ఉదాత్త ఆశయంతో పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్ పట్ల ఏహ్య భావంతో రాహుల్ నోరు పారేసుకుంటున్నారు. బిజెపితో కలిసి అని నిందిస్తున్నారు. ఇలాంటి నిందలతో అధికారంలోకి రావాలనుకోవడం కాంగ్రెస్‌కు అసాధ్యం అని తెలుసుకోవాలి.

# నాగపూర్‌ను ముంచెత్తిన బౌద్ధ సంద్రం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు ప్రజలందరినీ పండుగలు పేరుతో మతం మత్తులో ముంచితేలిస్తున్నాయి. సహజంగా దేశంలో ప్రజలకు దైవభక్తి ఎక్కువ. దీనిని ఆసరాగా చేసుకుని భారత రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేసిన పాలకులు, ఆ ప్రమాణాలను, రాజ్యాంగ లక్ష్యాలను పక్కన బెట్టి, సెక్యులర్ అనే భావన పాటించకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మత క్రతువుల్లో పాల్గొంటూ, ప్రజలను కూడా వీటిలో భాగస్వామ్యం చేయడం జరుగుతున్నది. దీంతో దేశం లో తాండవిస్తున్న నిరుద్యోగం, అధిక ధరలు, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, మానవ అభివృద్ధి వంటి అంశాలు పక్కదోవపట్టిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రజలు కూడా ఇటువంటి అంశాలను సీరియస్‌గా ఆలోచించకుండా పండుగలు జరుపుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఈ మత మైకంలో వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోకలేకపోవడం బాధాకరం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా, నేటికీ మన అక్షరాస్యత 74% శాతంగా ఉంది. ఇది కూడా కేవలం సంతకాలు చేసిన వారిని కలుపుకుంటే... లేదంటే అరవై శాతంలోపే... దీని వల్ల ప్రజల్లో చైతన్యం, అవగాహన లేకపోవడం వల్ల అసలు సమస్యలు, దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగం, అధిక ధరలు వంటి అంశాలు అర్థం చేసుకోలేకపోవడంతో పాలకులుచెప్పే మాటల గారడీలో పడిపోతున్నారు. అందుచేతనే వారి జీవితాలు అన్ని రకాలుగా అంతంత మాత్రంగానే ఉన్నాయి.. నేటికీ దాదాపు సగం జనాభా ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్ పథకం, సంక్షేమ పథకాలు, ఉచిత పథకాల మీదే ఆధారపడి జీవిస్తున్నారు.ప్రపంచంలో ఎక్కడా లేని వివిధ రకాల పండుగలు దేశంలో ఉన్నాయి. పూర్వం కాలంలో మామూలుగా పండుగ కార్యక్రమాలు జరుపుకుని, వారి దైనందిన జీవితంలో మునిగిపోయే వారు. కానీ నేడు పండుగలను 'పెద్ద పెద్ద ఈవెంట్స్' లాగా ప్రభుత్వాలే జరపటం ఆశ్చర్యం వేస్తుంది. పుష్కరాలు అని, పౌర్ణమి అని, ఉత్సవాలు అని భారీ ఎత్తున, రోజులు తరబడి చేయడం జరుగుతుంది.కొద్ది మొత్తంలో ప్రభుత్వాలు ఖర్చు చేసి, భారీ ఎత్తున ప్రజల నుంచి ఆదాయం సమకూర్చుకోవడం జరుగుతుంది. అనగా భక్తిని 'వ్యాపారం' గా మార్చివేసారు. ప్రజలు నుంచి కొన్ని కోట్ల రూపాయలు దండుకుంటున్నారు.దేవస్థానాలు, ట్రస్టులు, ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు భారీగా ఆర్థికంగా బలపడుతున్న పరిస్థితి. నేటి ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన విద్య, వైద్యం, కనీస అవసరాలు తీర్చడం మానేసి, ప్రజలను మభ్యపెట్టే మత క్రతువుల్లో పాల్గొనేటట్లు ప్రోత్సాహిస్తున్నాయి. అసలు ఈ ఆధునిక కాలంలో ప్రపంచ దేశాలతో పోలిస్తే వివిధ రంగాల్లో అనగా అక్షరాస్యత, ఆరోగ్యం, ఉద్యోగ, ఉపాధి విషయంలో, సంతోష సూచిలో, మానవ అభివృద్ధి సూచికల్లో మనం ఎక్కడ ఉన్నాం అని ప్రశ్నించుకుని ప్రభుత్వాలు పనిచేయాలి. కొంతమంది చేతిలోనే దేశసంపద కేంద్రీకృతమై, కొద్దిమంది బిలియనీర్ల సంపద పెరుగుదలచూసి దేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతుంది అని మురిసి పోవడం చాలా హాస్యాస్పదంగా ఉంది.ఎందుచేతనంటే దాదాపు సగం జనాభా ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత, సంక్షేమ పథకాలతోనే జీవితాలు గడుపుతున్నారు. ఫిన్లాండ్, స్వీడన్, నార్వే వంటి దేశాలను దృష్టిలో ఉంచుకుని మన దేశాన్ని నడిపించాలి. వలసలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. అవినీతిని నిర్మూలించాలి. దక్షిణ కొరియా, జపాన్, చైనా, క్యూబా వంటి దేశాలు ఉత్పత్తి రంగంలో ఎలా అభివృద్ధి చెందుతున్నయో చూసి దేశంలో అమలు చేయాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీటవేయాలి. శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి.'ఆత్మనిర్భర్ భారత్, మేక్ఇన్ ఇండియా' అనే కార్యక్రమాలు మొదలు పెట్టి దాదాపు దశాబ్దం కాలం గడిచినా ఏ మేరకు ఆ లక్ష్యం చేరేమో ఈ ప్రభుత్వాలు పునఃసమీక్ష చేసారా! ఇటువంటి అంశాలపై దృష్టి సారించడం మానివేసి, కేవలం మత క్రతువులకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తే ఎలా! ఎప్పటికి మన దేశం 'వికసిత భారత్' అవుతుంది...!? ప్రపంచ దేశాలు అన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతుంటే మన విద్యాలయాల్లో తిరిగి వాస్తు, జ్యోతిష్యం, మతపరమైన అంశాలు వంటివి ప్రవేశపెడుతుంటే, ఇక మన విద్యార్థులు అంతర్జాతీయ విద్యార్థిగా ఎలా మారతాడో ప్రభుత్వాలు చెప్పాలి. ఇకనైనా ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు విడనాడాలి. ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి తగు చర్యలు తీసుకోవాలి. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు స్వస్తి పలకాలి. ప్రభుత్వాలు ఇకనైనా పటిష్ట చర్యలు తీసుకోవాలి. అప్పుడు మాత్రమే నిజమైన వికసిత భారత్‌గా ఉంటుంది.

# విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హుకూం జారీచేశారు. విదేశీ విద్యార్థుల రాకపై ఆంక్షలు లాంటి కత్తి పెట్టారు. పరిమిత సంఖ్యలోనే వారిని అనుమతించాలని యూనివర్సిటీలను ఆదేశించారు. అమెరికా ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల అడ్మిషన్లను పరిమితం చేయాలని వైట్ హౌజ్ విశ్వవిద్యాలయాలకు తేల్చిచెప్పింది. ఈమేరకు ప్రతిపాదించిన నిబంధనలను మెమో రూపంలో దేశంలోని ప్రధాన యూనివర్శిటీలకు పంపింది. ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి, జాతి, లింగ ఆధారిత నియామకాలు నిలిపివేయడం, విద్యార్థుల అడ్మిషన్ సమయంలో కచ్చితంగా ప్రామాణిక పరీక్ష నిర్వహించడం వంటివి చేపడితేనే ప్రభుత్వ నిధుల కేటాయింపులో ప్రాధాన్యం లభిస్తుందని వెల్లడించింది. ఈ నిబంధనలను అంగీకరించిన విశ్వవిద్యాలయాలు ప్రభుత్వం నుంచి వచ్చే లబ్దిని పొందవచ్చని ఆ లేఖలో వెల్లడించారు. వీటిల్లో విద్యార్థులకు ప్రభుత్వ రుణాలు, గ్రాంట్లు, కాంట్రాక్టులు, రీసెర్చి నిధులు, విదేశీ స్కాలర్స్‌కు వీసా అనుమతులు, ట్యాక్స్ కోడ్‌లో ప్రాధాన్యం వంటివి పొందవచ్చని పేర్కొంది. అమెరికాలో ఉన్నతవిద్యను పునర్ వ్యవస్థీకరించి తమ భావజాలానికి అనుకూలం గా మార్చుకోవడానికి ట్రంప్ కార్యవర్గం చేస్తున్న మరో యత్నంగా దీనిని భావిస్తున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రభుత్వంతో 500 మిలియన్ డాలర్ల డీల్ చాలా దగ్గరగా ఉందని పేర్కొన్నారు. వైట్‌హౌస్ నుంచి లేఖలు అందుకొన్న వాటిలో అమెరికాలోని ఎంఐటీ సహా ప్రముఖ విశ్వవిద్యాలయాలు మొత్తం ఉన్నాయి. ఈ క్రమంలో విదేశీ వీసాలపై వచ్చే విద్యార్థుల సంఖ్య 15 శాతానికి మించి ఉండకూడదు. ఒకే దేశం నుంచి వచ్చిన విద్యార్థుల సంఖ్య 5 శాతానికి మించకూడదు. విదేశాల నుంచి అందే నిధుల వివరాలను బహిర్గతం చేయాలి. విద్యార్థుల అడ్మిషన్, ÷నాన్షియల్ ఎయిడ్ సమయంలో లింగ, జాతి, జాతీయత, రాజకీయ భావజాలం, జెండర్ ఐడెంటిటీ, లైంగిక ఆకర్షణ, మతపరమైన అంశాలు పరిగణనలోకి తీసుకోకూడదు.అండర్ గ్రాడ్యుయేట్ దరఖాస్తుదారులు కచ్చితంగా ప్రామాణిక పరీక్షను పూర్తిచేయాల్సిందే. విద్యా స్వేచ్ఛను కాపాడే విధానాలు అమలుచేయాలి. సంప్రదాయవాద ఆలోచన సరళిని ఇబ్బందిపెట్టే, దాడులకు పాల్పడే యూనిట్స్‌ను తొలగించడం వంటివి ఉన్నాయి. విద్యాలయాలను ఇబ్బందిపెట్టేలా రాజకీయ ప్రదర్శనలు, విద్యార్థులను లేదా గ్రూపులను వేధించకుండా చర్యలు చేపట్టాలి. ఉద్యోగులు అధికారిక విధుల సమయంలో రాజకీయ ప్రసంగాలు, చర్యలకు దూరంగా ఉండాలి. బాత్‌రూమ్‌లు, లాకర్ రూమ్‌లు లింగ ఆధారంగా వేర్వేరుగా ఉండాలి. హార్డ్‌సైన్స్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉచిత ట్యూషన్ ఫీజ్, ప్రోత్సాహకం కింద 2 మిలియన్ డాలర్లు మించి ఇవ్వాలని ప్రతిపాదించారు.ఈ నిబంధనలు ఏమేరకు అమలుచేస్తున్నారనే అంశాన్ని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్స్‌ను సమీక్షించి తెలుసుకొంటుంది. వీటిని ఉల్లంఘిస్తే ప్రభుత్వ లబ్దిని రెండేళ్లపాటు ఆపేస్తారు.

## దామోదర్ రెడ్డికి సిఎం రేవంత్ నివాళి

హైదరాబాద్,మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. హైదారాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దామోదర్‌రెడ్డి బుధవారం రాత్రి మృతిచెందారు. ప్రజల సందర్శనార్థం ఇవాళ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు.దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి తదితరులు ఉన్నారు. దామోదర్ రెడ్డి, తాను ఒకేసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టామని, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని కోదండరెడ్డి కొనియాడారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నాయని... కోలుకుని తిరిగి పార్టీలో ఉంటారని తాము భావించామన్నారు. ఆయన మృతి ఉమ్మడి నల్గొండ జిల్లాకే కాదు తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని పేర్కొన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా, లింగాల గ్రామంలో జన్మించిన దామోదర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో నల్గొండ జిల్లా, తుంగతుర్తి నియోజకవర్గం నుంచి నాలుగు పర్యాయాలు ఎంఎల్ఏగా ఎన్నికయ్యారు. సూర్యాపేట నుంచి ఒక పర్యాయం ఎంఎల్ఏగా విజయం సాధించారు. 2023 చివరలో జరిగిన ఎన్నికల్లో సూర్యాపేట నియోజకవర్గంలో నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. దామోదర్‌రెడ్డిని ఆయన అభిమానులు 'టైగర్' అని ముద్దుగా పిలుచు కుంటారు. ఆయన అంత్యక్రియలు తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. దామోదర్ రెడ్డి పార్థివదేహాన్ని కడసారి సందర్శించేందుకు సూర్యాపేటలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేస్తున్నారు. దామోదర్ రెడ్డి మరణం పట్ల సిఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు.

## పెదనాన్న లైంగిక వేధింపులు.. యువతి ఆత్మహత్య

మేడ్చెల్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలో పెద్దనాన్న లైంగికంగా వేధించడంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కొంపల్లిలోని పోచమ్మగడ్డలో ఓ విద్యార్థిని ఇంటర్ సెకండియర్ చదువుతోంది. సొంత పెద్దనాన్న నుంచి లైంగిక వేధింపులు ఎక్కువ కావడంతో ఆ యువతి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుంది. పేట్ బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కారేపల్లి మాజీ సర్పంచ్ కాంగ్రెస్‌కు రాజీనామా

ఖమ్మం,ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలోని సింగరేణి(కారేపల్లి) మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కారేపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ అదెర్ల స్రవంతి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. మండల కేంద్రంలోని నివాసంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో వర్గవిభేదాలు,ఆధిపత్య పోరు,స్థానిక నాయకత్వ సమన్వయ లోపం కారణమన్నారు. అలాగే పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానం లేకపోవడం,రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అనుచరులలో తాను ఒకదానినని కాబట్టి తనకు సరైన గుర్తింపు లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో ఇమడలేక పోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో సింగరేణి మండలంలో మేజర్ గ్రామపంచాయతీ ఐన కారేపల్లి సర్పంచ్ గా పంచాయతీ అభివృద్ధికి నా వంతు కృషి చేశానన్నారు. ముఖ్యంగా మండల కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాల వల్లే తాను పార్టీ మారుతున్నట్టు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏ పార్టీలో చేరేది మరి కొద్ది రోజుల్లో చెప్తానని వెల్లడించారు.

# ఐసన్ హోవర్ కత్తిపై ట్రంప్ కన్ను

వాషింగ్టన్, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహానికి గురయితే అంతే సంగతులు అన్నది నిరూపిస్తున్నారు. తాజాగా ఓ మ్యూజియం ఉద్యోగిపై వేటు వేశారు. ఆయన కన్ను ఓ మ్యూజియంలోని పురాతన కత్తిపై పడింది. దానిని ఐరోపాలోని ఓ రాజుకు బహూకరించాలనుకొని.. కత్తి పంపించమని ఆ మ్యూజియంకు కబురుపెట్టారు. ఆ మ్యూజియం నిర్వాహకుడు అది అమెరికా చారిత్రక సంపద అని, తాను ఇవ్వనని తేల్చిచెప్పాడు. అంతే.. ఉద్యోగంలో ఉంటావా.. పీకిపారేయాలా అని ట్రంప్ కార్యవర్గం నుంచి ఫోనొచ్చింది. అయినా సరే నిర్వాహకుడు ఆ కత్తి కోసం తన ఉద్యోగాన్నే వదులు కొన్నాడు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెల బ్రిటన్ పర్యటనకు వెళ్లారు. ఈసందర్భంగా అక్కడి రాజు చార్లెస్‌కు బహూకరించేందుకు ప్రెసిడెంట్ డ్వైట్ డి ఐసన్‌హోవర్ లైబ్రరీ అండ్ మ్యూజియంలో పురాత ఖడ్గాల కలెక్షన్ నుంచి ఒక దానిని రాజుకు ఇవ్వాలని భావించారు. దీంతో విదేశాంగశాఖ రంగంలోకి దిగి ఆ కత్తిని అప్పగించాలని కోరింది. వాస్తవానికి ఆయన కోరిన ఖడ్గం ఐసన్‌హోవర్‌కు 1947లో బహుమతిగా లభించింది. అప్పట్లో ఆయన అమెరికాకు చీఫ్ ఆఫ్ ది ఆర్మీగా పనిచేసేవారు. అప్పటి హాలెండ్ రాణి విల్‌హెల్మిన దానిని బహూకరించారు. దీంతో ఆ ఖడ్గాన్ని ట్రంప్‌నకు అప్పగించేందుకు లైబ్రరీ నిరాకరించింది. అది అమెరికా ప్రజల ఆస్తి అని తేల్చిచెప్పింది. దీంతో చేసేదిలేక.. మెలానియా ట్రంప్ అలాంటి ఖడ్గం నమూనాను బ్రిటన్ రాజు చార్లెస్ కు బహూకరించారు. ఆ పర్యటనను ముగించి తిరిగివచ్చాక సదరు లైబ్రరీ డైరెక్టర్ టోడ్డ్ ఆరింగ్టన్‌కు వేధింపులు మొదలయ్యాయి. ట్రంప్ కార్యవర్గానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు చెలరేగాయి. దీనిని ఆరింగ్టన్ ఖండించారు. తాను తప్పుగా ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. అయితే ఇటీవల ఆయనకు ఉన్నతాధికారులు ఫోన్ చేసి రాజీనామా చేయాలని లేకపోతే తొలగిస్తామని తేల్చిచెప్పారు. దీంతో ఆరింగ్టన్ రాజీనామా చేశారు. తనకు చరిత్ర, ఉద్యోగం అంటే చాలా ఇష్టమని ఆయన వాపోయారు. ఐసన్‌హోవర్ రెండో ప్రపంచ యుద్ధ సమయంలో మిత్ర సేనలకు ఐరోపాలో సుప్రీం కమాండర్‌గా వ్యవహరించారు. 1953 నుంచి 1961 వరకు అమెరికా అధ్యక్షుడిగా పనిచేశారు.

# రష్యా వాణిజ్య మిత్రులపై ట్రంప్ పెత్తనం

మాస్కో,రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందున భారత్‌పై ట్రంప్ భారీ సుంకాలతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. దీనిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందిస్తూ ట్రంప్ విధానాలను తీవ్రంగా ఖండించారు. బయటి దేశాల ఒత్తిడికి భారత్ తలొగ్గకూడదని చెప్పారు. గురువారం దక్షిణ సోచిలోని మీడియాతో పుతిన్ మాట్లాడారు. మాస్కోతో ఇంధన వాణిజ్యాన్ని తగ్గించుకోవాలని ఇతర దేశాలపై ట్రంప్ చేస్తున్న ఒత్తిడిని పుతిన్ తప్పుబట్టారు. ఈ చర్య వల్ల వాషింగ్టన్‌కే ఎదురుదెబ్బ తగులు తుందని హెచ్చరించారు. రష్యా వాణిజ్య భాగస్వాములపై అధిక సుంకాలు విధిస్తే.. అది ప్రపంచంలోని ఇంధన ధరలపై ప్రభావం పడుతుందన్నారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఎక్కువగా పెంచేలా చేస్తుందని.. దాంతో అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తుందని హెచ్చరించారు. ఈసందర్భంగా డిసెంబరులో భారత్ లో పర్యటించనున్న విషయాన్ని పుతిన్ వెల్లడించారు. ప్రధాని మోదీతో తనకు మంచి స్నేహబంధం ఉందని చెప్పారు. ఇక, అమెరికా విధించిన శిక్షాత్మక సుంకాల నేపథ్యంలో భారత్ ఎదుర్కొంటున్న నష్టాలను రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు సమతుల్యం చేస్తాయన్నారు. వాణిజ్య ఇబ్బందులను తొలగించేందుకు తాము చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. భారత్‌తో ఏఐ భాగస్వామ్యానికి మద్దతిస్తున్నట్లు తెలిపారు. ఆ దేశం నుంచి మరిన్ని వ్యవసాయ, ఔషధ ఉత్పత్తులు కొనుగోలు చేస్తామన్నారు. ఈసందర్భంగా అమెరికన్ మార్కెట్‌కు తాము పెద్ద మొత్తంలో యురేనియంను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాను ఓ పేపర్ టైగర్ అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కూడా పుతిన్ స్పందించారు. 'యూరప్‌లో పెరుగుతున్న రక్షణాత్మక చర్యలను తాము నిశితంగా గమనిస్తున్నామన్నారు. రష్యా ఉక్రెయిన్‌తోనే కాకుండా మొత్తం నాటో కూటమితోనే యుద్ధం చేస్తోందన్నారు. అయినా తమను కొందరు కాగితపు పులిగా పేర్కొంటున్నారు. మరి నాటో ఏంటని ట్రంప్‌నకు కౌంటర్ ఇచ్చారు.

## మురకంబుట్ట రేప్ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

చిత్తూరు,చిత్తూరు జిల్లాలో సంచలనం సృష్టించిన బాలిక గ్యాంగ్ రేప్ కేసులో జిల్లా పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి రహస్య ప్రాంతంలో విచారించారు. ఆ తర్వాత చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ మీడియా ఎదుట నిందితులను హాజరు పరిచి.. వివరాలను వెల్లడించారు. ఆ తర్వాత చిత్తూరు నగరంలోని నడి రోడ్డుపై నడిపించుకుంటూ నిందితులను కోర్టుకు పోలీసులు తరలించారు. ఈ సందర్భంగా స్థానికులు నిందితులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. సెప్టెంబర్ చివరి వారంలో చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని మురకంబుట్ట నగరవనం పార్కులో ఒంటరిగా ఉన్న ప్రేమ జంటపై ముగ్గురు యువకులు దాడి చేసి.. వారి వద్ద నుంచి నగదు దొంగలించారు. ఆ తర్వాత బాలికపై సామూహిక అత్యాచారం చేశారు. అనంతరం వారు పరారయ్యారు. దీంతో జరిగిన విషయాన్ని బాలిక.. తన తల్లిదండ్రులకు వివరించింది. వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగసముద్రంకు చెందిన హేమంత్, మురకంబుట్ట అగ్రహారానికి చెందిన కిశోర్, మహేశ్‌లు.. ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆ క్రమంలో శుక్రవారం నిందితులను పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో అరెస్ట్ చేశారు. నగరవనం పార్కుకు ఒంటరిగా వచ్చే మహిళలు, ప్రేమ జంటలు లక్ష్యంగా చేసుకుని ఈ ముగ్గురు నిందితులు బెదిరింపులకు పాల్పడే వారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రేమ జంటను తమ సెల్ ఫోన్లు ద్వారా చిత్రీకరించడం.. వాటిని కుటుంబ సభ్యులకు చూపిస్తా మంటూ బెదిరింపులకు పాల్పడే వారంటూ ఇప్పటికే వారిపై ఫిర్యాదులు అందాయి. ప్రేమ జంటల వద్ద నుంచి నగదు, నగలు దోచుకోవడంతోపాటు యువతులు, బాలికలపై అత్యాచారం జరిపే వారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆ క్రమంలో వారి సెల్ ఫోన్లను సైతం పోలీసులు స్వాధీనం చేసుకుని.. వాటిలోని ఫోటోలు, వీడియోలను సైతం పరిశీలిస్తున్నారు. కాగా నిందితులపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దోపిడి, హత్యాయత్నం, కిడ్నాప్ కింద పలు కేసులను నిందితులపై పోలీసులు నమోదు చేశారు. మరోవైపు బాధితురాలిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఈ వైద్య పరీక్షల్లో బాలికపై అత్యాచారం జరిగినట్లు నిర్ధారణ అయినట్లు వైద్యుల నివేదిక స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

# ప్రజల ఒత్తిడి, నిధుల లేమి.. అసహనంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు!



హైదరాబాద్,నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడం, ప్రజల నుంచి ఒత్తిడి పెరగడం, చిన్న చిన్న పనుల కోసం కూడా నెలల తరబడి ఎదురు చూడాల్సి రావడం కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అసహనానికి, ఆగ్రహానికి కారణమవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్గతంగా ఆగ్రహంతో రగిలిపోతున్నా.. పైకి మాత్రం కొందరు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని అంటున్నారు. అయినప్పటికీ కొందరు ఎమ్మెల్యేలు బహిరంగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చురకలు అంటిస్తూనే ఉన్నారని పరిశీలకులు చెబుతున్నారు. జడ్చర్లలో అరబిందో ఫార్మా కంపెనీ వ్యర్థ జలాలను వదిలేస్తూ పరిసర ప్రాంతాల పంట భూములను, చెరువును కలుషితం చేస్తున్నదని, 24 గంటల్లో సరిదిద్దకపోతే కంపెనీని తగులబెడ్తానని జడ్చర్ల ఎమ్మెల్యే జె అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మొయినాబాద్ మండలంలోని రెడ్డిపల్లిలోని తన ఫామ్ హౌస్‌కు వెళ్తుండగా దారి మధ్యలో చిల్కూరు చెరువు వద్ద స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య కన్పించడంతో ఆగారు. పార్టీలోకి ఎందుకొచ్చావే అనగా యాదయ్య చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. తన నియోజకవర్గంలో పునరుద్ధరణ పనులకు రూ.100 కోట్లు మంజూరు చేయాలని ఏకంగా ప్రపంచ బ్యాంకు (వరల్డ్ బ్యాంకు)కు ఎమ్మెల్యే కే మదన్ మోహన్ రావు లేఖ రాయడం సంచలనం సృష్టించింది. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతోనే ఈ లేఖ రాశారని జిల్లాలో ప్రజలు అనుకుంటున్నారు. ఈ వరుస విమర్శల పరంపర రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనను ఇరుకున పెట్టే విధంగా ఉందనే చర్చలు గాంధీ భవన్ లో జోరుగా సాగుతున్నాయి. కొందరు ప్రత్యక్షంగా విమర్శలు గుప్పిస్తుండగా మరికొందరు పరోక్షంగా ఇరుకునబెట్టే పనులు చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పై సొంత పార్టీ నేతలే తిరుగుబాటు చేస్తున్నారని కాంగ్రెస్ ముఖ్య నాయకులు చర్చించుకుంటున్నారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ లో జరిగిన సీఎల్పీ సమావేశంలో రేవంత్ రెడ్డి గట్టిగా చురకలు అంటించారు. ఎమ్మెల్యేల విమర్శలు ప్రతిదీ రికార్డు అవుతుందని, తీరు మార్చుకోనట్లయితే నష్టం జరుగుతుందని హెచ్చరించినా పెడచెవిన పెడుతున్నారంటే ఎమ్మెల్యేల్లో అసహనం, ఆగ్రహం ఏ స్థాయిలో ఉందో తెలిసిపోతున్నదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. స్థానిక ఎన్నికల తరువాత తారస్థాయికి వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదని అంటున్నారు. అంతర్గతంగా చాలా మంది ఎమ్మెల్యేల్లో అసంతృప్తి ఉందని, కొందరు బయటపడుతుండగా, మెజారిటీ ఎమ్మెల్యేలు మాత్రం అవకాశం, అదను కోసం చూస్తున్నారని కాంగ్రెస్ లోనే చర్చ జరుగుతోంది.

24 గంటల్లో అరబిందోను తగులబెడతా

'పోలేపల్లి స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లోని అరబిందో ఫార్మా కంపెనీ కి ఇప్పటికే ఎన్నోసార్లు చెప్పాను, హెచ్చరించాను. అయినా వినకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నందున 24 గంటల్లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోకపోతే నేనే వెళ్లి స్వయంగా కంపెనీ తగులబెడ్తాను' అని జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మీడియా ముఖంగా హెచ్చరించారు. ఫార్మా వదిలే హానికర వ్యర్థ జలాల కారణంగా ముదిరెడ్డి పల్లె చెరువులోకి రావడంతో చేపలు చనిపోతున్నాయన్నారు. చెరువు కింద ఉన్న భూముల్లో సాగు కలుషితమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. టీజీ పీసీబీ అధికారులకు, ఫార్మా మధ్య ఏమి లాలూచీ ఉందో తెలియదు కాని చర్యలు మాత్రం తీసుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే 24 గంటల గడువు నేపథ్యంలో మరుసటి రోజు హడావుడిగా మహబూబ్ నగర్ జిల్లా పీసీబీ అధికారులు తనిఖీ చేసి నమూనాలు సేకరించి వెళ్లిపోయారు. తనిఖీలు చేసి వారం రోజులు అవుతున్నా ఇంత వరకు నమూనాలపై అధికారిక ప్రకటన వెలువడ లేదు. అంతకు ముందు ఏపీ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు ను లక్ష్యంగా చేసుకుని అనిరుధ్ విమర్శలు గుప్పించారు. తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు బలంగా ఉన్నారని, నీటి పారుదల ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు దక్కించుకోవడమే కాకుండా హైదరాబాద్‌లో భయం లేకుండా దందాలు చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన తరువాత వారికి ఇక్కడ ఏం పని అంటూ%8% ఇంటి నల్లా కనెక్షన్, కరెంట్ కనెక్షన్ తీసేస్తే వాళ్లే చంద్రబాబు వద్దకు పరుగులు తీస్తారని, వెంటనే బనకచర్ల ప్రాజెక్టు ఆపమని కాళ్లా వేళ్లా పడతారని వ్యాఖ్యానించారు. ఆంధ్రావాళ్లు మంచిగా చెబితే వినరంటూ అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇరు రాష్ట్రాల మధ్య సామరస్యతను దెబ్బతీసే విధంగా ఉన్నాయని అప్పట్లో అనుకున్నారు. తిరుమలలో తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖలు అంగీకరించకపోతే, ఆంధ్రా వాళ్లను తెలంగాణలో తిరగనివ్వబోమని హెచ్చరించారు కూడా. ఈయన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇరుకున పెట్టే విధంగా, సూటిగా ఉన్నాయని కాంగ్రెస్ నేతలే అంగీకరిస్తున్నారు. ఈయనకు ప్రస్తుత క్యాబినెట్ లో ఉన్న ఒక మంత్రి గత ఎన్నికల్లో పట్టుబట్టి టిక్కెట్ ఇప్పించిన విషయం అందరికీ తెలిసిందే.

టార్గెట్ రేవంత్ రెడ్డి

తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా సొంత పార్టీ ప్రభుత్వంపై మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి విమర్శలు ఎక్కుపెట్టారు. హైదరాబాద్ గన్ పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించిన తరువాత మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకోకుండా యువతను మోసం చేసిందన్నారు. రెండు లక్షలు చెప్పి 50వేల ఉద్యోగాలు మాత్రం ఇచ్చారని, అయినా నిరాశ చెందవద్దని, మీకు అన్న లాగా అండగా ఉంటానని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. గ్రూప్ వన్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, సరిచేయకపోతే యువత తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. యువత అనుకుంటే ఏదైనా చేస్తారని, నేపాల్ దేశంలో తిరుగుబాటు చేసి ప్రభుత్వాన్ని కుప్పకూల్చారని గుర్తు చేశారు. నేపాల్ తరహాలో మన ప్రభుత్వాన్ని కూల్చేయడం ఖాయమని రాజగోపాల్ హెచ్చరించారు. అంతకు ముందు చౌటుప్పల్ మండలం ఎల్లగిరి లో మాట్లాడుతూ, గత ఇరవై నెలలుగా తన నియోజకవర్గంలో రోడ్లు, భవన నిర్మాణాల కోసం ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదని ఆరోపించారు. ఈ విషయమై మంత్రిని వందసార్లు కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. పదవులు మీరే తీసుకుని అనుభవిస్తున్నారు, నిధులు కూడా మీరే తీసుకుంటున్నారనేది అడగాలా.. వద్దా అని ఆయన ప్రశ్నించారు. వలిగొండ–చౌటుప్పల్ రోడ్డు పనులు నిధులు రాక స్థంభించిపోయాయని, అందుకే సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి పదవులు మీకే ఉన్నాయి, పైసలు కూడా మీకేనా అని విమర్శిస్తున్నట్లు రోజగోపాల్ రెడ్డి సమర్థించుకున్నారు. తాజాగా చిలుకూరు పెద్ద చెరువు వద్ద స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో మాట్లాడిన మాటలు కూడా చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్ పార్టీలో హాయిగా ఉండకుండా, కాంగ్రెస్ లోకి ఎందుకు వచ్చావని అన్నారు. ఎన్నో కష్టాలు పడి పార్టీని గెలిపించిన తమకే గౌరవ మర్యాదలు దక్కడం లేదని, అన్నీ తెలిసి ఎందుకొచ్చావంటూ రాజగోపాల్ ప్రశ్నించారు. అన్నింటికీ ఆయన మౌనమేదాల్చారు. రేవంత్ రెడ్డి టార్గెట్ గా రాజగోపాల్ చేస్తున్న విమర్శలు కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఆయన సీఎం వ్యాఖ్యలు, వైఖరిని తప్పుపడుతున్నా పార్టీ నాయకత్వం చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర వహిస్తుందనే విమర్శలు కూడా ఉన్నాయి.

ఏకంగా ప్రపంచ బ్యాంకు కే నిధుల కోసం లేఖ

ఎన్నడూ లేని విధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో భారీ వర్షాలు కురవడంతో అనేక గ్రామాలు ముంపునకు గురై పంటలు నాశనం అయ్యాయని ఎమ్మెల్యే కే మదన్ మోహన్ రావు ఏకంగా ప్రపంచ బ్యాంకుకే లేఖ రాసి వివరించారు. తాగునీటి వనరులు ధ్వంసమయ్యాయని, వందలాది ఇళ్లు కూలిపోయాయని తెలిపారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని పునరావాసం, పునర్ నిర్మాణం, భవిష్యత్తు విపత్తుల సన్నద్ధత కోసం రూ.100 కోట్లు సహాయం మంజూరు చేయాలని వరల్డ్ గ్లోబల్ ఫెసిలిటీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్ అండ్ రికవరీ (జీ.ఎఫ్.డీ.ఆర్.ఆర్) కు విన్నవించారు. ప్రజల జీవితాలను సాధారణ స్థితికి తీసుకువచ్చే క్రమంలో దీర్ఘకాలిక రక్షణ చర్యల కోసం ఈ సాయం అవసరమని వారికి తెలిపారు. సాధారణంగా కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, న్యూ డెవలప్ మెంట్ బ్యాంకుల కు అప్పుల కోసం లేఖలు రాస్తుంటాయి. రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా నేరుగా లేఖ రాయడం సంచలనం కలిగిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అసహనం, ఆగ్రహంతోనే ఈ లేఖ రాసి బద్నాం చేశారనే చర్చ కాంగ్రెస్ పార్టీలో జరుగుతోంది.

వరంగల్ జిల్లాలో మరో సమస్య

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు మహిళా మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒకరు సీనియర్ మంత్రి కొండా సురేఖ కాగా, మరొకరు ధనసరి సీతక్క. సురేఖ పద్మశాలీ కులం కాగా, సీతక్క ఆదివాసీ బిడ్డ. ఈ జిల్లాలో వీరిద్దరినీ రేవంత్ రెడ్డి ప్రధాన సలహాదారు వేంరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంయుక్తంగా నియంత్రిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సురేఖకు వ్యతిరేకంగా జిల్లాలోని ఎమ్మెల్యేలు జట్టు కట్టడం వెనకాల వీరిద్దరి ప్రోద్బలం, సంపూర్ణ సహకారం ఉందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. జిల్లాలో తమ ఆధిపత్యం చేజారకుండా ఉండేందుకే ఇద్దరూ కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని సురేఖ వర్గీయులు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, సురేఖ మధ్య కొద్ది రోజుల క్రితం మీడియా ముఖంగా విమర్శల యుద్ధం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై సురేఖ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు లు పీసీసీ నాయకత్వం ముందు సంజాయిషీ ఇచ్చుకోవడం, ఆ తరువాత పార్టీ పెద్దల జోక్యంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ విభేధాలు రచ్చకెక్కే అవకాశాన్ని తొసిపుచ్చలేమని అంటున్నారు.

## ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేల ఆర్థిక సాయం

అమరావతి,ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేల ఆర్థిక సాయం అందించే పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. విజయవాడ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈ పథకాన్ని సీఎం ప్రారంభిస్తారు. ఈ మేరకు పథకం ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశమై 20 అజెండా అంశాలపై చర్చించింది. ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ 2024–29 అనుబంధ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖకు సంబంధించి వివిధ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కారవాన్ పర్యాటకానికి, అమృత్ పథకం 2.0 పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి భూసేకరణ విషయంలో కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇవ్వని భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు ఆమోదం తెలిపింది. అమరావతిలో వివిధ పనుల వేగవంతానికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. అమరావతి సహా రాష్ట్రవ్యాప్తంగా పలు సంస్థలకు భూకేటాయింపుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కుష్ఠు వ్యాధి పదం తొలగించేందుకు వీలుగా చట్టసవరణ చేయాలని నిర్ణయించింది. విద్యుత్ శాఖకు సంబంధించి పలు ప్రతిపాదనలకు, కార్మిక చట్టాల్లో పలు సవరణల ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. అలాగే, రాజధాని నిర్మాణం లో మరో కీలక ముందడుగు పడింది.రాజధాని అమరావతి కోసం భూ సేకరణ కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భూములు ఇవ్వని కొందరు రైతుల నుంచి భూసేకరణ చట్టం 2013 ద్వారా భూములు తీసుకోవాలని కేబినెట్. లో నిర్ణయం తీస్కున్నారు మేరకు ఏపీ క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.అమరావతిలో పనుల కోసం ఎస్‌పీవీ ఏర్పాటుకు ఆమోదం లభించింది. పలు సంస్థలకు భూ కేటాయింపులు చేసేందుకు కేబినెట్ ఆమోదించింది.

# ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడరాదు

అమరావతి,అసెంబ్లీలో కొందరు ఎమ్మెల్యేలు ఇష్టారీతిన మాట్లాడారు.. వారిని నియంత్రించాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని సీఎం చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జి మంత్రుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత పలు అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. శాఖాపరంగా ఎలాంటి విమర్శలొచ్చినా గట్టిగా స్పందించాలి. చరిత్రలో తొలిసారి 93శాతం రిజర్వాయర్లు నింపాం. విజన్–2047లోని 10 సూత్రాల్లో ఇదో కీలక పరిణామం. పూర్వోదయ పథకం ద్వారా ఉద్యాన, ఆక్వా రంగాల్లో రాష్ట్రానికి రూ.65వేల కోట్లు వచ్చే అవకాశముంది. అన్ని ప్రాంతాల్లోనూ విజయవాడ ఉత్సవ్ తరహాలో ఈవెంట్లు పెట్టాలి. స్థానిక పండుగలను ప్రోత్సహించేలా నెలకో ఈవెంట్ పెట్టాలి. కడపలో జిందాల్ ఉక్కు పరిశ్రమను 2028లోపు పూర్తి చేస్తాం. ఈ నెల 16న ప్రధాని కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలని సీఎం సూచించారు.అయితే, చామ్ విధానంలో పట్టణాభివృద్ధి చేపట్టిన నిర్మాణాలు ఇతర శాఖలు అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు తెలిపారు. పూర్వోదయ పథకంలో ఏపీకి స్థానం లభించిన విషయాలు మంత్రులతో పంచుకున్నారు. ఏ పథకం ద్వారా దాదాపు రూ. 65 వేల కోట్లు ఉద్యాన, ఆక్వా రంగాలకు వచ్చే అవకాశం ఉంది. యానిమల్ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.. విజయవాడ ఉత్సవ్ తరహాలో నెలకో ఈవెంట్ రాష్ట్రంలో స్థానిక పండుగల్ని ప్రోత్సహించేలా అన్ని ప్రాంతాల్లో చేపట్టాలి అన్నారు. కర్నూల్ లో ఈ నెల 16వ తేదీన ప్రధాని మోడీ పర్యటన విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

కరీంగనర్,స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు గట్టిగా ఓడించేందుకు ఎదురు చూస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండలాధ్యక్షులు, జడ్పీటీసీ ప్రభారీలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ జిల్లా పరిషత్ పీఠంపై కాషాయ జెండా ఎగరేయడం ఖాయమని, సిరిసిల్ల జడ్పీ పీఠం కూడా ఈసారి బీజేపీ ఖాతాలో చేరబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు జరగాలని ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని సంజయ్ తెలిపారు. 'కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయి. నిధులేమీ లేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. గ్రామాల్లో సర్పంచులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా మంది అప్పులు తీరచేయలేక ఊళ్లను వదిలి నగరాలకు వలస వెళ్లారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పుడు బీజేపీని అధికారంలోకి తెచ్చి అభివృద్ధి దిశగా నడిపించేందుకు ప్రజలంతా కసరత్తు చేస్తున్నారని అన్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, వృద్ధులు, తాజా మాజీ సర్పంచులు, ఉద్యోగులే ఈసారి బీజేపీ బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తారని బండి సంజయ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఈ వర్గాలందరికీ అన్యాయం జరిగింది. హామీలు ఇచ్చి ఒక్కటినీ అమలు చేయలేదు. మహిళలకు నెలనెలా 2500 రూపాయలు, వృద్ధులకు పెన్షన్ పెంపు, రైతులకు రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు భరోసా కార్డులు ? అన్నీ మోసమే అయ్యాయి. ఈసారి ఈ వర్గాలే కాంగ్రెస్ కు బుద్ధి చెప్పబోతున్నారని మండిపడ్డారు. అభ్యర్థుల టిక్కెట్ల విషయంలో బీజేపీ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, రాష్ట్ర నాయకత్వం సర్వేలు నిర్వహిస్తోందని సంజయ్ తెలిపారు. గెలిచే అవకాశం ఉన్న వారికే టిక్కెట్లు ఇస్తాం. టిక్కెట్ రాకపోయినా బాధపడొద్దు. పార్టీ పదవుల రూపంలో గౌరవం, సహాయం అందిస్తాం. కానీ పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కష్టపడాలి. పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం కన్నతల్లికి ద్రోహం చేసినట్లే. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.గ్రామాల్లో జరుగుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర నిధులతోనే సాధ్యమయ్యాయని సంజయ్ గుర్తుచేశారు. ఉపాధి హామీ పనులు, ప్రధాని సడక్ యోజన, సీఐఆర్ఎఫ్ నిధులతో రహదారులు, కమ్యూనిటీ హాళ్లు, బోర్లు ఇవన్నీ మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధుల వల్లే సాధ్యమయ్యాయి. కాంగ్రెస్ పాలనలో పంచాయతీలకు ఒక్క పైసా కూడా రాలేదు. బీఆర్ఎస్ గెలిచినా పరిస్థితి మారదు. గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక నాయకులు, సిరిసిల్ల జిల్లా నాయకుడు సురేందర్ రావు సహా పలువురు నేతలు బండి సంజయ్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు.

# రక్షణశాఖ భూములు అప్పగించండి

హైదరాబాద్,హైదరాబాద్ నగరంలోని రక్షణశాఖ భూములను రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగించేందుకు అనుమతివ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్.. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణెళిశ్ సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని హైదరాబాద్‌లో రాజ్‌నాథ్‌సింగ్‌కు మంత్రి పొన్నం అందజేశారు. హైదరాబాద్‌కు వచ్చిన రాజ్‌నాథ్‌కు ఆయన ఘనంగా స్వాగతం పలికారు. అదే సమయంలో వినతి పత్రాన్ని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారని పొన్నం ఆశాభావం వ్యక్తం చేశారు. జంట నగరాల్లో ప్రజలకు కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో రక్షణ శాఖ భూములు ఎంతో ఉపయోగపడతాయని, కంటోన్మెంట్ నుంచి తెలంగాణ ప్రభుత్వానికి యూజర్ ఛార్జీల కింద వచ్చే దాదాపు రూ.వెయ్యి కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని రక్షణమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ బకాయిలను సకాలంలో విడుదల చేయడం వల్ల రక్షణ శాఖ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, అవసరమైన పౌర సేవలు కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు లభిస్తుందని పొన్నం వివరించారు. ప్రజా వినియోగం కోసం కొన్ని రక్షణ భూములను ఇవ్వడానికి అంగీకరించినందుకు భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్న మంత్రి పొన్నం.. ఈ భూములను అప్పగించే పక్రియను వేగవంతం చేయాలని కోరారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్‌కు అందించిన వినతి పత్రంలో పొన్నం అభ్యర్థించారు. మంత్రి పొన్నం తన లేఖలో రక్షణ శాఖ భూములను ప్రజా ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రభుత్వానికి కేటాయించేందుకు కేంద్రం సానుకూలంగా ముందుకు రావడంపై ధన్యవాదాలు తెలిపారు. భూమి అప్పగింపు పక్రియను వేగవంతం చేయాలని కోరారు. నగరాభివృద్ధి, పౌర సౌకర్యాల కోసం జరుగుతున్న మౌలిక సదుపాయాలు, మొబిలిటీ ప్రాజెక్టులకు ఈ భూమార్పిడి అత్యవసరమని గుర్తు చేశారు. అదే విధంగా, గత కొంతకాలంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ దృష్ట్యా ఎన్నికలు త్వరితగతిన నిర్వహించాలంటూ రక్షణ మంత్రిని అభ్యర్థించారు. హైదరాబాద్ అభివృద్ధి దిశలో రక్షణ శాఖ అవసరమైన చర్యలు తీసుకుంటుందనే విశ్వాసం తనకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖలో పేర్కొన్నారు.

# కెనడాలో భారతీయ సినిమాల నిలిపివేత

టోరంటో, వరుస దాడులు జరుగుతోన్న నేపథ్యంలో కెనడాలోని ఓ థియేటర్‌లో భారతీయ సినిమాల ప్రదర్శనను నిలిపివేశారు. భారతీయ సినిమాలు ప్రదర్శితమవుతోన్న సమయంలోనే ఈ దాడులు జరుగుతున్నాయని అందుకే వాటి ప్రదర్శనను రద్దు చేస్తున్నామని థియేటర్ యాజమాన్యం తెలిపింది. కెనడాలోని ఓక్‌విల్లే ప్రాంతంలో ఫిల్మ్.కా థియేటర్‌లో వారం రోజుల వ్యవధిలోనే రెండుసార్లు దాడులు జరిగాయి. దీంతో భారతీయ సినిమాల ప్రదర్శనను నిలిపివేసింది. ఆ సినిమాల్లో 'కాంతార చాప్టర్ 1', 'ఓజీ' కూడా ఉండడంతో వాటిని కూడా ప్రదర్శించడం లేదని యాజమాన్యం తెలిపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 25న మొదటిసారి దాడి జరిగింది. ఇద్దరు అనుమానితులు హాలుకు నిప్పు అంటించే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలను ఆర్పారు. దీంతో పెద్దగా నష్టం జరగకపోవడంఓ ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా అక్టోబర్ 2న మరో దాడి జరిగింది. తెల్లవారుజాము ప్రాంతంలో ఒక అనుమానితుడు థియేటర్ ప్రవేశద్వారం వద్ద కాల్పులు జరిపాడు. దీంతో యాజమాన్యం సినిమాలను నిలిపివేసింది. ఈ దాడుల వెనక ఖలిస్థానీ ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు థియేటర్ యాజమాన్యం అనుమానిస్తోంది. అయితే పోలీసులు మాత్రం ఈ విషయాన్ని నిర్ధరించలేదు.

# భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి



న్యూఢిల్లీ,నరేంద్ర మోడీ పాలనలోని భారత్‌లో ప్రజాస్వామ్య దాడులు జరుగుతున్నా యంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశానికి అత్యంత ప్రమాదకరమైనది ఏదైనా ఉందంటే అది దేశంలో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడేనంటూ మండిపడ్డారు. కొలంబియా పర్యటనలో ఉన్న ఆయన ఈఐఏ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత్‌లో ఎన్నో మతాలు, కులాలు, సంప్రదాయాలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రతిఒక్కరికీ చోటుకల్పిస్తుంది. కానీ ప్రస్తుతం ఈ వ్యవస్థ ముప్పేటదాడిని ఎదుర్కొంటోందన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇంధన వినియోగంలో వచ్చిన మార్పులతో అనేక సామ్రాజ్యాల సృష్టి జరుగుతూవస్తోంది. బ్రిటిష్‌వారు ఆవిరి యంత్రం, బొగ్గుపై నియంత్రణ సాధించారు. తర్వాత వారు సూపర్‌పవర్‌గా మారారు. ఆ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి 1947లో మేం స్వాతంత్య్రం సాధించుకున్నాం. పెట్రోల్ వినియోగం పెరిగింది. ఆ క్రమంలో అమెరికన్ల పట్టుపెరిగింది. ప్రపంచం ఇప్పుడు ఎలక్ట్రిక్ మోటార్ వైపు మళ్లుతోంది. ఇప్పుడు పోటీ అమెరికా, చైనా మధ్య నెలకొని ఉంది. ఈ విషయంలో చైనానే ముందుంది. చైనాకు భారత్ పొరుగుదేశం. అమెరికాకు మిత్రదేశం. ఈ రెండు దేశాలు పోటీపడుతుంటే మధ్యలో మేం ఉన్నాం. చైనాకంటే భారత్ జనాభా ఎక్కువ. ఆ దేశంలో కేంద్రీకృత వ్యవస్థ ఉంది. ఇండియాలో వికేంద్రీకృత, వైవిధ్య వ్యవస్థ ఉంది. అది సంక్లిష్టంగా ఉంటుంది. చైనాతో పోల్చుకుంటే భారత్‌కున్న సామర్థ్యాలు భిన్నమైనవి. మా దేశం అధ్యాత్మిక, సైద్ధాంతిక సంప్రదాయాలను కలిగిఉంది. అవి ఈనాటికీ ఆచరణీయమైనవి. చైనాలాగా భారత్ తన ప్రజలను అణచి వేయదని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఆర్థిక వృద్ధి ఉంది. అయితే మాది సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థ. కానీ ఉత్పత్తి భారీ స్థాయిలో లేకపోవడంతో ఉద్యోగాల కల్పన ఆశించినస్థాయిలో లేదు. చైనా అప్రజాస్వామిక వాతావరణంలో ఉత్పత్తి చేస్తోంది. కానీ మాకు ప్రజాస్వామ్య వ్యవస్థే ఉండాలి. అలాంటి వ్యవస్థను అభివృద్ధి చేయడమే సవాలని పేర్కొన్నారు.

# మారుతున్న కాలనుగుణంగా కొత్త చట్టాలు



హైదరాబాద్, మారుతున్న సమాజానికి అనుగుణంగా చట్టాలు తీసుకుని వచ్చే ఆలోచనలో ప్రధాని మోడీ ఉన్నారని, పాతచట్టాలకు పాతరేయాల్సి ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంకా బ్రిటిష్ కాలం నాటి చట్టాలు కొనసాగడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు చాలా కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతి శాఖ అనేక సంస్కరణలు తీసుకువస్తోందని చెప్పుకొచ్చారు. కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందని... వాటిని సమర్థవంతంగా ఎదుర్కొవాలని సూచించారు. బ్రిటిష్ చట్టాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయని తెలిపారు. వర్తమాన ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచిస్తున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ఆ పార్టీ స్టేట్ లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు, ఎంపీలు కె.లక్ష్మణ్, రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. అర్జున్ రామ్ మేఘువాల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం పాలసీలకు అనుగుణంగా కోర్టుల్లో మనం వాదిస్తామనేది చాలా కీలకమని తెలిపారు. రానున్న మూడేళు మోదీ ప్రభుత్వానికి చాలా కీలకమని ఉద్ఘాటించారు. అందుకు ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని మార్గనిర్దేశంచేశారు. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు ఎఫర్ట్ పెట్టాలని సూచించారు. తెలంగాణలో అధికారంలోకి బీజేపీ రావాలంటే అందరం కలసికట్టుగా పని చేయాలని కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. కాలం చెల్లిన చట్టాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రద్దు చేశారని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. దేశాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేసేందుకు ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ విజనరీ లీడర్ కాబట్టి వేగంగా స్పందిస్తున్నారని చెప్పుకొచ్చారు. జీఎస్టీ తగ్గింపుతో దీపావళి వెలుగులను పేదల ఇళ్లల్లో మోదీ నింపుతున్నారని వివరించారు. అగ్రదేశాలు అడ్డగోలు టారిఫ్‌లతో భారతదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇండియా ఎదుగుదలను చాలా దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయన్ని ÷ర్ అయ్యారు. స్వదేశీ వస్తువుల వినియోగించడం ద్వారా.. భారతదేశ ఆదాయం ఇతర దేశాలకు వెళ్లకుండా ఉంటుందని వెల్లడించారు. దీని ద్వారా పెట్టుబడులు పెరుగుతాయని... ఇతరులకు ఉపాధి కలుగుతోందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం దక్కాలని గత చట్టాలను రద్దు చేసి.. భారత న్యాయ సంహిత చట్టాలను మోదీ సర్కార్ తెచ్చిందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. హైదరాబాద్ నడి రోడ్డుపై గతంలో ఓ న్యాయవాది దంపతులను నరికి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు వేసిన వాళ్లను వెనక్కి తీసుకోకపోతే హత్య చేశారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం జరుగుతోందని వివరించారు. న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు దేశంలో రావాలని రాంచందర్ రావు ఆకాంక్షించారు.

# బీహార్ లో పీకే ప్రభావమెంత?.. లాభమెవరికి.. నష్టం ఎవరిది?



పాట్నా:ఒకప్పుడు రాజకీయ పార్టీలకు వ్యూహకర్తగా పని చేసిన ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే.. ఇప్పుడు తన పార్టీకి తాను ఎన్నికల వ్యూహాలు రచించుకుంటున్నారు. ఔను ఒక్కప్పుడు ఏ రాష్ట్రంలోనైనా ఫలానా పార్టీ అధికారంలోకి రావాలంటే.. ఆ పార్టీకి ప్రశాంత్ కిషోర్ ఎన్నికల స్ట్రాటజిస్ట్ అయ్యి ఉండాలి అని అంతా భావించారు. 2014 ఎన్నికలలో కేంద్రంలో మోడీ నాయకత్వంలో ప్రభుత్వం కొలువుదీరడానికైనా, 2019 ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ లో జగన్ ముఖ్యమంత్రి అయ్యారన్నా.. అలాగే పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి వరుసగా మూడో సారి అధికార పగ్గాలను అందుకున్నారన్నా.. అందుకు ప్రశాంత్ కిశోర్ ఎన్నికల వ్యూహాలే కారణమన్నది పరిశీలకులు విశ్లేషణ. అలాంటి ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు సొంతంగా జన సురాజ్ పేరుతో ఒక రాజకీయ పార్టీ పెట్టుకుని త్వరలో బీహార్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలలో ఒంటరిగా రంగంలోకి దిగుతున్నారు. ప్రశాంత్ కిశోర్ స్వరాష్ట్రం బీహార్ అయినప్పటికీ ఈ సారి ఆయన ఎన్నికల వ్యూహాలు ఫలించే అవకాశాలు అంతంత మాత్రమేనన్నది పరిశీలకుల విశ్లేషణ. మూడేళ్ల కిందట సరిగ్గా ఇదే నెలలో ఆయన జగన్ సూరజ్ పార్టీ అధినేతగా బీహార్ లో పాదయాత్ర ఆరంభించారు. అప్పటి నుంచీ రాష్ట్రమంతటా తిరుగుతూనే ఉన్నారు. ఇప్పటి వరకూ ఆయన రాష్ట్ర వ్యాప్తంగా 5500 గ్రామాలను పాదయాత్ర ద్వారా చుట్టేశారు. భారీ ర్యాలీలు, బహిరంగ సభల వంటివి లేకుండానే.. తన పాదయాత్రలో భాగంగా ఇల్లిల్లూ తిరుగుతున్నారు. భారీ ర్యాలీలూ, ప్రసంగాలకు దూరంగా. ఆయన ప్రజలలో మమేకమై వారి సమస్యల పరిష్కారం విషయంలో గట్టిగా నిలబడతానని హామీ ఇస్తున్నారు. ఈ క్రమంలో ప్రశాంత్ కిశోర్ పట్ల యువత ఆకర్షితులౌతున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అందుకే బీఆర్ లో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో ప్రశాంత్ కిశోర్ గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా ప్రజా హృదయాలను గెలుచుకున్నారంటున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో గెలుపు, ఓటమి అన్న అంశాల జోలికి పోకుండా జనసురాజ్ పార్టీ అన్ని నియోజకవర్గాలలోనూ పార్టీ వాయిస్ ను వినిపించాలన్న లక్ష్యంతో ప్రశాంత్ కిశోర్ ముందుకు సాగుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే వారంలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. బీఆర్ లో ప్రధాన పోరు ఎన్డీయే, ఇండియా కూటముల మధ్యే ఉందని సర్వేలు చెబుతున్నాయి. అంతే కాకుండా స్వల్ప మొగ్గు ఇండి కూటమి (బీహార్ లో మహాఘట్ కూటమి) వైపే ఉందని సర్వేలు చెబుతున్నాయి. అదే సమయంలో ప్రశాంత్ కిషోర్ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నాయి. బీహార్ ఎన్నికలలో ప్రశాంత్ కిశోర్ జనసూరజ్ పార్టీ కీలక పాత్ర పోషించనుందని ఆ సర్వేలు చెబుతున్నాయి.పార్టీ ఏర్పాటు చేసిన తరువాత తొలి సారి ఎన్నికల రణరంగంలోకి అడుగుపెట్టిన శాంత్ కిషోర్ తన పార్టీ అభ్యర్థులను అన్ని నియోజకవర్గాలలోనూ నిలబెట్టనున్నారు. సర్వేల అంచనా ప్రకారం ప్రశాంత్ కిషోర్ జన సూరజ్ పార్టీ 8 నుంచి 11 శాతం ఓట్లు సాధించే అవకాశాలున్నాయి. అయితే సీట్ల పరంగా మాత్రం ప్రశాంత్ కిషోర్ జీరో నంబర్ తోనే సరిపెట్టుకోవాల్సి ఉంటుందంటున్నారు. ఇక రాష్ట్రంలో నితీష్ కుమార్ ప్రభుత్వం తీవ్ర ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్నదని సర్వేలు పేర్కొన్నాయి. ప్రశాంత్ కిశోర్ పార్టీ ఎనిమిది నుంచి 11 శాతం ఓట్లు సాధించడమంటే.. ప్రభుత్వ వ్యతిరేక ఓటును భారీగా చీల్చడమే అవుతుందన్న అభిప్రాయం కూడా వ్యక్తం అవుతున్నాయి. ఆ సంగతి అటుంచితే..ప్రకాంత్ కిషోర్ కొత్త పార్టీతో తొలి సారి ఎన్నికల రణరంగంలోకి దిగి ఆ మాత్రం ఓట్ షేర్ సాధించడంటే మాటలు కాదని అంటున్నారు.

# విండోస్ 10కు కాలం చెల్లినట్లే




న్యూఢిల్లీ, కంప్యూటర్‌లో విండోస్ 10 వాడుతున్న వారికి ఇదో హెచ్చరిక. విండోస్ 10 వాడుతున్న వారికి త్వరలో మైక్రోసాఫ్ట్ సపోర్ట్ నిలిపివేయనుంది. అక్టోబర్ 14 నుంచి ఎలాంటి సెక్యూరిటీ అప్‌డేట్స్ విడుదల చేయబోమని స్పష్టంచేసింది. ఒకవేళ ఇప్పటికీ ఈ ఆపరేటింగ్ సిస్టమ్‌నే వాడుతుంటే 11కు అప్‌డేట్ అవ్వాల్సిందే. విండోస్ 10కు సపోర్ట్ నిలిపివేయనున్నట్లు దాదాపు రెండేళ్ల క్రితమే మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఆ గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. విండోస్ 10కు మైక్రోసాఫ్ట్ సపోర్ట్ నిలిపివేసినా ఎప్పటిలానే ఓఎస్ పని చేస్తుందని మైక్రోసాఫ్ ప్రతినిధి తెలిపారు. అయితే, సెక్యూరిటీ అప్‌డేట్స్ మాత్రం రావని స్పష్టంచేశారు. దీనివల్ల భద్రతా పరమైన రిస్కులు, మాల్‌వేర్, కంపాటబిలిటీ వంటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో బ్రౌజింగ్ చేసే వారికి రిస్క్ పొంచి ఉంటుందని పేర్కొన్నారు. అయితే, సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ అప్‌డేట్స్ మాత్రం 2028 అక్టోబర్ వరకు కొనసాగుతాయని మైక్రోసాఫ్ట్ స్పష్టంచేసింది. ఇది ప్రాథమిక స్థాయిలో భద్రతను మాత్రమే అందించగలదు. అలాగే, ఆపరేటింగ్ సిస్టమ్ సెక్యూరిటీ అప్‌డేట్స్‌తో పోలిస్తే యాంటీ వైరస్‌లు ఇచ్చే భద్రత అంతంతమాత్రమేనని పేర్కొంది. ఒకవేళ పూర్తి స్థాయిలో భద్రత కోరుకునేవారైతే ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ ప్రోగ్రామ్‌ను ఎంపిక చేసుకోవచ్చని మైక్రోసాఫ్ట్ సూచించింది. దీనికి కొంతమొత్తం చెల్లించాల్సి ఉంటుంది. అక్టోబర్ 15 నుంచి డివైజ్ సెట్టింగ్స్‌లో సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌ను అందుబాటులో ఉంటుంది. మైక్రోసాఫ్ట్ విండోస్ 10ను లక్షలాది మంది వినియోగిస్తున్నారు. వారంతా 11కు అప్‌గ్రేడ్ అయ్యేలా చూడాలన్నది మైక్రోసాఫ్ట్ భావిస్తోంది. అందుకే విండోస్ 11కు అప్‌గ్రేడ్ అవ్వకపోతే సెక్యూరిటీ అప్‌డేట్స్ నిలిపివేస్తామంటోంది. ఏదైనా కారణం చేత విండోస్ 10లోనే కొనసాగాల్సి వస్తే.. డబ్బులు పెట్టి ఎక్సటెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ ప్రోగ్రామ్ కింద సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు ఈ ఈఎస్‌యూ ప్రోగ్రామ్‌లో కేవలం సెక్యూరిటీ అప్‌డేట్స్ మాత్రమే లభిస్తాయి. కొత్త ఫీచర్లు గానీ, డిజైన్ మార్పిడి రిక్వెస్టులు గానీ, నాన్ సెక్యూరిటీ రిక్వెస్టులు గానీ అందించదు.

# దేశ ఔన్నత్యం నిలబెడుతున్న మోడీ



న్యూఢిల్లీ, ప్రజాస్వామ్యంపై జరుగుతోన్న దాడి భారత్‌కు పొంచిఉన్న ముప్పు అని కొలంబియా పర్యటనలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ ఘాటుగా స్పందించింది. ఇతర దేశాల్లో భారత్‌ను అవమానించడమే రాహుల్ పనని..దేశ ప్రజలను నిజాయితీ లేనివారిగా ఆయన చిత్రీకరిస్తున్నారని బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడూ భారత్‌ను విమర్శించే కాంగ్రెస్ నేతను చూసి.. దేశ ప్రజలు అవమానకరంగా భావిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ విదేశాల్లో దేశ ఖ్యాతిని పెంచుతుంటే..దానిని ఎలా తగ్గించాలా అని రాహుల్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇటువంట పనులు చేయడం వల్ల ప్రజలకు వారిపై ఉన్న నమ్మకం పోయిందన్నారు. భాజపా నేత ప్రదీప్ భండారీ సైతం రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. భారతదేశాన్ని, దాని పురోగతిని ద్వేషించే వ్యక్తి మాత్రమే విదేశాలకు వెళ్లి దేశాన్ని అవమానిస్తాడని అన్నారు. ఇదే మనస్తత్వంతో గత 70 ఏళ్లుగా కాంగ్రెస్ పాలకులు దేశ అభివృద్ధిని అడ్డుకున్నారని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం చూసి..అసూయతో రాహుల్ ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన ఎప్పటికీ భారత్‌ను వ్యతిరేకించే నేతగానే మిగిలిపోతారన్నారు. ప్రస్తుతం కొలంబియా పర్యటనలో ఉన్న రాహుల్ ఈఐఏ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

# లోకేశ వర్సెస్ కర్నాటక మంత్రులు.. మాటల యుద్ధం దేనికి..



బెంగళూర్ :మేం వాటిని మర్యాదపూర్వకంగా స్వీకరించి, పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామంటూ ఎక్స్‌లో లోకేశ్ పోస్టు చేశారు. దీంతో..అక్కడ సౌకర్యాలు లేవని ఇన్వెస్టర్లు అంటారు. అయితే మీకు మా స్టేట్ దగ్గరే. పక్కనే అనువైన స్థలం ఉంది. రండి వచ్చేయండి. పెట్టుబడులు పెట్టండి అని లోకేశ్ వెల్‌కమ్ చెప్తారు. కట్ చేస్తే..లోకేశ్ చేసిన ట్వీట్స్‌కు..కర్ణాటక మంత్రులు హర్ట్ అయిపోతున్నారు. తమ స్టేట్‌ను అంటారా అంటూ..ట్విట్టర్‌లో రివర్స్ అటాక్ చేస్తున్నారు. ఈ మాటల యుద్ధం కాస్త ఇన్వెస్ట్‌మెంట్స్ వార్‌గా మారుతోంది. అసలు లోకేశ్ ట్వీట్ ఏంటి? కర్ణాటక మినిస్టర్ల రిప్లై ఎందుకు? అసలు ఈ వివాదం ఏంటి?కర్ణాటక, ఏపీ ప్రభుత్వాల మధ్య ఆసక్తికర డైలాగ్‌వార్ నడుస్తోంది. కారణం ఏదైనా బెంగళూరులో పరిశ్రమలను రన్ చేయలేకపోతున్నామని..అక్కడి నుంచి వెళ్లిపోతామంటూ పలువురు ఇండస్ట్రియలిస్టులు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. ఇదే అదునుగా..రండి..రండి దయ చేయండి. ఏపీలో మీకు రెడ్ కార్పెట్ వెల్‌కమ్ అంటూ లోకేశ్ చేస్తున్న ట్వీట్స్ ఆసక్తికరంగా మారాయి.గతంలో కర్ణాటకలో ఏరో స్పేస్ పార్క్ ఏర్పాటుపై స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. ప్రైవేటు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయిస్తే నాస్కామ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ రెండు సందర్భాల్లోనూ ఆయా పరిశ్రమలకు ఏపీలో తగిన మౌలిక వసతులు కల్పిస్తామని, ఏపీకి రావాలంటూ మంత్రి నారా లోకేశ్ సాదరంగా ఆహ్వానించారు.

**లోకేశ్ ట్వీట్ తో కర్నాటక రాజకీయాల్లో కాక..**

ఇక బ్లాక్ బక్ అనే పరిశ్రమ సీఈవో బెంగళూరు రోడ్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఓ ట్వీట్ చేశారు. తమ పరిశ్రమను బెంగళూరు నుంచి తరలిస్తామని ప్రకటించారు. బ్లాక్ బక్ సీఈవో రాజేష్ యాబాజీ చేసిన ట్వీట్‌పై ఏపీ మంత్రి నారా లోకేశ్ రియాక్ట్ అయ్యారు. బ్లాక్ బక్ పరిశ్రమలను విశాఖపట్నానికి తరలించాలని కోరారు. దీంతో కర్ణాటక రాజకీయాల్లో కాక రేగింది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే అక్కడి పరిశ్రమలు ఏపీకి తరలించాలని చూస్తున్నాయని అక్కడి విపక్షాలు సిద్దరామయ్య సర్కార్‌పై అటాక్ స్టార్ట్ చేశాయి.

**కర్ణాటక ప్రభుత్వంతో లోకేశ్ నేరుగా మాటల యుద్ధం..**

అప్పుడు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ బ్లాక్ బక్ సీఈవో రాజేశ్ యాబాజీ ట్వీట్‌ను బ్లాక్ మెయిలింగ్‌గా అభివర్ణించారు. డీకే శివకుమార్ కామెంట్స్‌పై మంత్రి లోకేశ్ మరోసారి రియాక్ట్ అయ్యారు. ఇతర రాష్ట్రాలకు ఏపీకి ఉన్న తేడా ఇదే. మా ప్రజల ఫిర్యాదులను మేం బ్లాక్ మెయిల్ అంటూ తోసిపుచ్చబోమ్. మేం వాటిని మర్యాదపూర్వకంగా స్వీకరించి, పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామంటూ ఎక్స్‌లో లోకేశ్ పోస్టు చేశారు. దీంతో కర్ణాటక ప్రభుత్వంతో లోకేశ్ నేరుగా మాటల యుద్ధానికి దిగినట్లు అయింది. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకొచ్చేందుకు మంత్రి లోకేశ్ దూకుడుగా వ్యవహరిస్తున్నారనే దానికి ఇదో నిదర్శనమని అంటున్నారు.

ఇప్పుడు లేటెస్ట్‌గా మరో చర్చ తెరమీదకు వచ్చింది. కర్ణాటకకు చెందిన మాధ్యూఫిలిప్ అనే వ్యక్తి బెంగళూరు ఔటర్ రింగ్ రోడ్ నుంచి ఉత్తర దిక్కువైపు ఐటీ కంపెనీల విస్తరణకు ప్రోత్సాహం ఇవ్వాలని ట్విటర్‌లో కోరారు. దీనిపై ఏపీ మంత్రి లోకేశ్ స్పందిస్తూ రీట్వీట్ చేశారు.

ఇది ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక ఖర్గేను ఉలిక్కిపడేలా చేసింది. బెంగళూరు నగరానికి ఉత్తరం వైపు అనంతపురం నగరం ఉందని, అక్కడ ఐటీ, ఏరో స్పేస్ పరిశ్రమలు పెట్టేందుకు అనుకూల వాతావరణం, కావాల్సినంత భూమి ఉందని లోకేశ్ ట్వీట్ చేశారు.

**కర్ణాటక ఐటీ మంత్రికి కోపం తెప్పించిన లోకేశ్ ట్వీట్..**

ఇది కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గేకు కోపం తెప్పించింది. మంత్రి లోకేశ్ ట్వీట్‌పై కర్ణాటక ఐటీ మంత్రి స్పందిస్తూ చేసిన వ్యాఖ్యలే దుమారం లేపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రెండు రాష్ట్రాల మధ్య పెట్టుబడులు, పరిశ్రమల ఆకర్షణలో పోటీ తీవ్రరూపం దాల్చుతున్నట్లు చెబుతున్నారు. మంత్రి లోకేశ్ చొరవ, ఏపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలతో కర్ణాటకలో ఏర్పాటు చేయాల్సిన మిట్టల్ స్టీల్ విశాఖపట్నం తరలిరావాలని డిసైడ్ అయిందట.బెంగళూరులో ఏరో స్పేస్ పరిశ్రమలకు తగిన స్థలం లేకపోవడంతో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆ రంగానికి చెందిన పారిశ్రామిక వేత్తలు చర్చలు జరుపుతున్నట్లు టాక్. రాయలసీమలోని నాలుగు జిల్లాలు బెంగళూరు, చెన్నై మెట్రో సిటీలకు అతి దగ్గరలో ఉండటంతో రాష్ట్ర సరిహద్దుల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవాలని ఏపీ సర్కార్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్ట్‌మెంట్స్, కంపెనీలు తెచ్చేందుకు బెంగళూరుతో పోటీ పడుతూ లోకేశ్ చేసిన ట్వీట్‌తో..రెండు రాష్ట్రాల మంత్రుల మధ్య డైలాగ్‌వార్‌కు దారితీస్తోంది.

# బ్రహ్మోస్ ను మించి ధ్వని క్షిపణి




న్యూఢిల్లీ, బ్రహ్మోస్ ను మించి ధ్వని క్షిపణి తయారీకి డిఆర్‌డిఏ రంగం సిద్ధం అవుతున్నట్లు సమాచారం. రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధిస్తున్న భారత్.. మరింతగా అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్ తరవాత తమ దృష్టిని పెంచింది. స్వదేశీ అధునాతన ఆయుధాల ఉత్పత్తికి పెద్దపీట వేస్తోంది. అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, డ్రోన్ల ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణి ప్రయోగాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ 'ధ్వని' పరీక్షలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని డీఆర్‌డీఓ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దడ పుట్టించిన బ్రహ్మోస్ కంటే ఈ క్షిపణులు భీకరంగా పనిచేస్తాయని అంచనా. అత్యంత వేగంగా ప్రయాణిస్తూ సుదూర లక్ష్యాలను నిమిషాల్లో ఛేదించగల సామర్థ్యం హెచ్‌జీవీల సొంతం. శబ్ద వేగానికి ఐదారు రెట్ల కంటే అధిక వేగంతో ఈ క్షిపణులు ప్రయాణించగలవు. డీఆర్‌డీఓ సిద్ధం చేస్తోన్న హెచ్‌జీవీ (ఆరలజీనితి) సుమారు గంటకు 7వేలకుపైగా కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 1500 నుంచి 2వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదని అంచనా. వేగంతో పాటు దిశను మార్చుకునే సామర్థ్యం ఉండడంతో శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలకు స్పందించే సమయం కూడా ఇవ్వదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. హైపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణులకు భిన్నంగా ఈ నూతన గ్లైడ్ వెహికల్ ఉంటుంది. రాకెట్ సాయంతో అత్యంత ఎత్తుకు వెళ్లి.. అక్కడ నుంచి విడిపోయి హైపర్‌సోనిక్ వేగంతో లక్ష్యంవైపు దూసుకెళ్తుంది. శత్రువుల గగనతల నిరోధక వ్యవస్థలకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించే సామర్థ్యమున్న ఈ హెచ్‌జీవీ పరీక్షలను డీఆర్‌డీఓ ముమ్మరం చేసింది. ఇప్పటికే ఎయిర్‌ఫ్రేమ్ ఏరోడైనమిక్స్, థర్మల్ మేనేజిమెంట్, స్క్రామ్‌జెట్ ఇంజిన్ పనితీరు, గైడెన్స్ వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయి, వైమానిక పరీక్షలు చేసింది. ఈ ఏడాది చివరి నాటికి 'ధ్వని' పూర్తి స్థాయి పరీక్షలు జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## ఏడుపాయలలో తగ్గని మంజీరా ఉధృతి

మెదక్, మెదక్ జిల్లా ఏడుపాయలలో మంజీరా నది ఉధృతి కొనసాగుతోంది. దీంతో వన దుర్గామాత ఆలయాన్ని ఆనుకుని భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య పూజలు చేస్తున్నారు. వనదుర్గ ఆనకట్ట నుంచి 1.09లక్షల క్యూసెక్కుల వరదనీటిని

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com